TELTEL/2016/69862

# జనం పవర్

తెలుగు దినపత్రిక

JANAM POWER

కరీంనగర్ మంగళవారం 26.08.2025 సంపుటి : 10 సంచిక : 90 పేజీలు : 12 వెల 05/-

Karimnagar Tuesday 26.08.2025 Volume : 10 Issue : 90 Pages : 12 Cost 05/-




EDITOR:
BANDARI MARUTHI

# కవిత ఒంటరి

కవిత భవిష్యత్ ఏమిటి? సొంతంగా పార్టీ పెడతారా?



బీఆర్ఎస్ పార్టీలో తగ్గుతున్న ప్రాధాన్యం

కవిత తీరుపై కేటీఆర్, కేసీఆర్ కోపం

ఇంటికి కూడా రానివ్వని కేసీఆర్

రాఖీ కట్టించుకోనేందుకు అన్నయ్య నిరాకరణ

హరీశ్ రావు నుంచి కవితకు దక్కని మద్దతు

బీఆర్ఎస్ పార్టీలోనే ఆమెపై విమర్శలు

లేదంటే ఏదైనా పార్టీలో చేరుతారా?

అన్న కేటీఆర్ తో రాజీ కుదుర్చుతారా?

**జనం పవర్, హైదరాబాద్ :**

భారతరాష్ట్ర సమితి పార్టీలో ఇటీవల కొన్ని పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశముగా మారాయి. ముఖ్యంగా ఎమ్మెల్సీ కవితకు సంబంధించిన పరిణామాలు పార్టీ అంత ర్గత ధోరణులపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కవిత పార్టీ స్థాయిలో, కుటుంబ స్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బంది లు ఇప్పుడు బహిరంగ చర్చకు దారి తీస్తున్నాయి. కవిత, పార్టీ నేత కేటీఆర్ మధ్య విబేధాలు తీవ్రంగా ఉన్నాయని సమాచారం. గతంలో ఇద్దరూ సమన్వయంతో పార్టీ కార్యక్రమాలు నడిపించినప్పటికీ, ఇప్పుడు వారిద్దరి మధ్య గాఢమైన భేదాభిప్రాయాలు వచ్చినట్లు తెలు స్తోంది. ఈ విభేధాల్లో ముఖ్యమైంది ఆర్గనైజేషన్ సంబంధిత అంశాలే

..మిగతా 2లో

# రూల్ ఈస్ రూల్ రూల్ ఫర్ ఆల్..

## ప్రధాని జైలుకెళ్లినా.. రాజీనామా చేయాల్సిందే



చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలు

జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి రాకూడదు

ఈ బిల్లు కచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం లభిస్తుంది

'రాజ్యాంగ సవరణ'పై విపక్షాలకు అమిత్ షా కౌంటర్

**జనం పవర్, హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి అయినా..ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి వి షయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ఏఎన్ఐ'కి అమిత్ షా ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్

..మిగతా 2లో

ఉస్మానియా వర్సిటీ, తెలంగాణ

# అవిభక్త కవలలు



ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో ఉస్మానియా వర్సిటీ

గొప్ప వాళ్లందరూ ఇక్కడి నుండి వచ్చినవారే

సకల వసతుల కోసం అవసరమైన ప్రణాళికలు చేయండి

అందుకోసం నిపుణుల కమిటీని వేయండి

అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధం

వసతి భవనాలను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**జనం పవర్, హైదరాబాద్ :**

ఉస్మానియా వర్సిటీ అనే పదం తెలంగాణకు ప్రత్యామ్నాయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ రెండు

..మిగతా 2లో



## అమెరికా భారత్ సంబంధాలు మరింత క్షీణిస్తాయా?

ట్రంప్ వివాదాస్పద నిర్ణయం

భారత్ ను తీవ్రంగా వ్యతిరేకించి వ్యక్తికి రాయబారిగా అవకాశం

3

## ఢిల్లీ ముఖ్యమంత్రి హత్యకు ప్లాన్

తొలుత కత్తితో పొడవాలనుకున్న నిందితుడు

భద్రత కారణంగా దాడి చేయాలని నిర్ణయం

రేఖా గుప్తాపై దాడి కేసులో పలు కీలక విషయాలు

3





## నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి

బీసీ రిజర్వేషన్లు, ఫిరాయింపుల అంశంపై చర్చలు

3







Contact: 96181 81112

# కుక్కలను తరిమికొట్టాల్సిందే

ఏటా కుక్కకాటు మరణాలు ఏటా లక్షల్లోనే

రేబిస్ వ్యాధిగ్రస్థుల పరిస్థితి అంతే

జంతుప్రేమికుల అతి ప్రేమ

కుక్కల ప్రేమికులంతా ధనవంతులే..

శునకాల భారిన పడుతున్నది మురికివాడల ప్రజలే

ఏసీల్లో తిరుగుతూ.. ఇంట్లో భద్రంగా ఉంటే

జంతు ప్రేమికులకు కుక్కల బాధ ఎలా పడుతుంది?

కోర్టులు చెప్పినా పట్టించుకోని అధికారులు



**జనం పవర్, హైదరాబాద్ :**

దేశంలో కుక్కల దాడి కేసుల ముప్పు గత కొంతకాలంగా తీవ్ర ఆం దోళనకు గురి చేస్తోంది. చిన్న పిల్లలు, వృద్ధులు, పేదవర్గాల ప్రజలు ముఖ్యంగా ఈ సమస్యను

..మిగతా 2లో



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



# ఉస్మానియా యూనివర్సిటీలో ముళ్లకంచెలెందుకు?: హరీశ్‌రావు

జనం పవర్, హైదరాబాద్

సీఎం ఓయూ పర్యటన దృష్ట్యా విద్యార్థుల ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా? అని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఉస్మానియా వర్సిటీ, తెలంగాణ
# అవిభక్త కవలలు

(మొదటి పేజీ తరువాయి)

అవిభక్త కవలలు లాంటివన్నారు. ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దుందుభి, భీమా వసతి భవనాలను ప్రారంభించిన అనంతరం.. డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, కోదండరామ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ''పీవీ నరసింహారావు, చెన్నారెడ్డి, జైపాల్‌రెడ్డి, ఉస్మానియా వర్సిటీ నుంచి వచ్చిన వారే. తెలంగాణలో ఏదైనా సమస్య వచ్చినా, ఉద్యమానికి పురిటిగడ్డ ఉస్మానియా వర్సిటీయే. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పింది ఉస్మానియానే. యాదయ్య.. తెలంగాణ కోసం అమరులయ్యారు. ఈ వర్సిటీ ఐపీఎస్, ఐఏఎస్‌లను అందించింది. ఈ వర్సిటీకి గొప్ప చరిత్ర ఉంది. వందేళ్లలో ఓయూకు వీసీగా దళితుడిని నియమించింది కాంగ్రెస్ ప్రభుత్వమే. గత పాలకులు కుట్రపూరితంగా ఓయూను నిర్వీర్యం చేయాలని చూశారు. ఉస్మానియా వర్సిటీలో చదువుకున్న వారికి చాలా అవకాశాలు వచ్చాయి. యువ నాయకత్వం దేశానికి అవసరం ఉంది. దేశానికి అతిపెద్ద సంపద యువతే.విద్యార్థులకు నేను ఇచ్చేది నాణ్యమైన విద్య మాత్రమే. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గం. నేను సీఎం అయ్యాక సామాజిక బాధ్యతగా వర్సిటీలకు వీసీలను నియమించాను. చదువు ఒక్కటే అన్నింటికీ పరిష్కారం. ఉస్మానియా వర్సిటీ చదువులకే కాకుండా పరిశోధనలకు వేదిక కావాలి. విద్యార్థుల కోసం పని చేయని వారిని వ్యతిరేకించండి. డిసెంబర్‌లో ఆర్ట్స్ కళాశాల వద్ద సభ పెడితే నేను వస్తా. అన్ని పనులు మంజూరు చేస్తా. ఒక్క పోలీసును కూడా క్యాంపస్‌లో ఉంచొద్దు. ఒక వేళ విద్యార్థులు నన్ను అడ్డుకొని ప్రశ్నిస్తే చిత్తశుద్ధితో సమాధానం చెబుతా. ఉస్మానియా వర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నేను సిద్ధం. సకల వసతులు చేకూర్చేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయండి. అందుకోసం నిపుణులతో కమిటీ వేయండి. నిధులు సమకూర్చేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది.'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# కుక్కలను తరిమికొట్టాల్సిందే

మొదటి పేజీ తరువాయి

ఎదుర్కొంటున్నారు. రెబిస్ వంటి భయంకరమైన సమస్యతో ఏటా వందల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినప్పటికీ "జంతు ప్రేమ" పేరుతో కొంతమంది ఈ సమస్యను చిన్నదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. కోర్టులు, నగరపాలక సంస్థలు తప్పనిసరిగా ఎదుర్కోవలసిన సామాజిక-ఆరోగ్య సమస్యగా ఇది మారింది.



**ప్రమాదకరమైన వీధికుక్కలు**

పట్టణాల్లో, గ్రామాల్లో ఒకే తరహా దృశ్యం - చెత్త కుప్పల చుట్టూ గుంపులుగా తిరిగే వీధికుక్కలు. పగలంతా అలానే తిరుగుతూ, రాత్రిపూట రోడ్లపై గుంపులుగా తిరిగే ఈ కుక్కలు వాహనదారులకు అడ్డంకులు అవుతూ ఉంటాయి. చాలాసార్లు బైక్ రైడర్లపై దాడి చేసి ప్రమాదాలకు దారితీస్తాయి. మరీ భయంకరమైన అంశం ఏమిటంటే, ఎలాంటి తప్పు చేయని బాలలపై ఆకస్మికంగా దాడి చేయడం. రెబిస్ బారిన పడితే ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది.

**బలయ్యేది పేదలే**

పేదవర్గాలు, ముఖ్యంగా మురికివాడల్లో నివసించే వారు ఎక్కువగా వీధికుక్కల బారిన పడుతున్నారు. అందుకు కారణం సుస్పష్టమే. మురికివాడల్లో చెత్త ఎక్కువగా పేరుకోవడం , పిల్లలు బయట ఎక్కువసేపు ఆడుకోవడం తక్షణ వైద్యం పొందే అవకాశం లేకపోవడం . ఈ పరిస్థితుల్లో కుక్కకాటుకు గురైన పలు చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకవైపు పేదరికం, మరోవైపు ఆరోగ్యసదుపాయాల లోపం , ఈ రెండు కలిసి కుక్కకాటు మరణాలకు దారి తీస్తున్నాయి.

**జంతుప్రేమికుల తప్పుడు వాదనలు**

ఈ సంఘటనలు జరిగినప్పటికీ కొందరు జంతుప్రేమికులు మాత్రం వీధికుక్కల మీద ప్రేమ చూపిస్తున్నారు. కుక్కలను హింసించకూడదు, వాటి హక్కులను కాపాడాలి అని చెబుతున్నారు. మనుషుల ప్రాణాలకంటే కుక్కల ప్రాణాలే ఎక్కువా? అన్న ప్రశ్నలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. ధనికవర్గాల జంతు ప్రేమికులకు ఈ ముప్పు కనబడదు. ఎందుకంటే వారి ఇళ్లు పెద్దవీ, గేట్లు బలమైనవీ. వారు కార్లలో ప్రయాణిస్తారు. వీధికుక్కలతో వారికి ఎలాంటి సంబంధమే ఉండదు. కానీ పేదవాడి చిన్నారి బయట ఆడుకుంటూ ఒక దాడికి గురైతే, ఆ ప్రాణం వెనక్కి రాదు. కాబట్టి జంతుప్రేమికుల వాదనలన్నీ పసలేనివే.

కోర్టుల ఆదేశాలు.. పాటించని అధికారులు

దేశంలోని పలు కోర్టులు ఇప్పటికే కుక్కల సమస్యపై సీరియస్‌గా వ్యాఖ్యానించాయి. ప్రజల భద్రత కుక్కల సంరక్షణ కంటే ముఖ్యమని స్పష్టం చేశాయి. వీధికుక్కలను తరలించే చర్యలు, శస్త్రచికిత్సల ద్వారా పెరుగుదలను నియంత్రించడం, టీకాలు ఇవ్వడం లాంటివి అనివార్యమని మార్గదర్శకాలు ఇచ్చాయి. అయితే వాస్తవం ఏమిటంటే, చాలా నగరాల్లో ఈ చర్యలు నిదానంగా సాగుతున్నాయి. అధికారులు తగినంత మనశ్శక్తి, వనరులు పెట్టడం లేదు. ఫలితంగా సమస్య పరిష్కారం కాక ప్రజలు మరణాల పాలవుతున్నారు.

ప్రజల ప్రాణాలు ముందు కావాలా? లేక వీధికుక్కల స్వేచ్ఛ ముందు కావాలా? ఈ ప్రశ్న ఇప్పుడు ప్రతి గల్లీలో వినిపిస్తోంది. ఒక చిన్నారి ప్రాణం విలువ లేనట్టేనా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కుక్కలకు ప్రేమ చూపించాలన్నా, వాటిని పట్టణాల మధ్యలోనే వదిలేయాలా లేదా ప్రత్యేక శ్రేణి ఆశ్రయాలలో ఉంచాలా అనేది జంతుప్రేమికులు సమాధానం చెప్పాల్సిన సమయం ఇది.

ఈ ఏడాది దేశంలో కుక్కకాటు కేసులు భారీగా నమోదయ్యాయి. జనవరి 2025లోనే 4,29,664 కేసులు నమోదయ్యాయి. 2024 ఏడాదిలో మొత్తం 37,15,713 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. గత మూడు సంవత్సరాల్లో మొత్తం కేసులు పెరుగుతూనే ఉన్నాయి- 2022లో 21,89,909, 2023లో 30,52,521, 2024లో 37,15,713 కేసులు నమోదయ్యాయి. దేశంలో సుమారు 5,700 మంది ప్రతిఏడాది రేబిస్ తో మరణిస్తున్నారని ప్రభుత్వ ఆరోగ్యశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రపంచఆరోగ్య సంస్థ లెక్కల ప్రమాకారం 18,000-20,000 వరకు రేబిస్ మరణాలు జరుగుతున్నాయని అంచనా. ఇది గ్లోబల్ రేబిస్ మరణాలలో సుమారు 36% భారత్ లోనే జరుగుతాయని వెల్లడించారు. 2025లో దేశవ్యాప్తంగా రేబిస్ కేసులు సంఖ్య నిర్ధారణగా తెలియదు కానీ.. ప్రధాన నగరాల్లో రెబిస్ బాధితుల సంఖ్య గణనీయంగానే ఉంది. ఢిల్లీలో జనవరిజూలై మధ్య 49 కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో 2024 లో 3.6 లక్షల కుక్కకాటు కేసులు, 42 మంది రేబిస్ మరణాలు నమోదయ్యాయి.

**రాష్ట్రాల వివరాలు**

మహారాష్ట్ర (20222024): 13.5 లక్షల కుక్కకాటు కేసులు

తమిళనాడు: 12.9 లక్షలు

గుజరాత్: 8.4 లక్షలు

ఈ ఏడాది (2025) దేశవ్యాప్తంగా కుక్కకాటు కేసులు: 4,29,664

2024 మొత్తం కేసులు: 37,15,713

కేంద్ర ప్రభుత్వం ప్రకారం, ప్రతిఏడాది రేబిస్ మరణాలు: *సుమారు 5,700*

ప్రపంచఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం, భారత్‌లో: *18,000-20,000*

**పరిష్కార మార్గాలు**

1. కుక్కలకు శస్త్రచికిత్సలు చేసి వృద్ధి తగ్గించాలి.
2. ప్రతి వీధి, ప్రతి వాడలో కుక్కలకు సమిష్టిగా టీకాలు వేయాలి.
3. వీధికుక్కలను ప్రత్యేక సెంటర్లలో ఉంచాలి.
4. చెత్త కుప్పలు వీధికుక్కలకు ప్రధాన ఆహారం. వాటిని నిలువనివ్వకపోతే వాటి గుంపులు తగ్గుతాయి.
5. కుక్కకాటు జరిగిన ప్రతీ చోట ఉచిత టీకాలు, వైద్యం అందుబాటులో ఉండాలి.

**సమాజం ఆలోచించాల్సిన విషయం**

జంతుప్రేమ అనేది మంచిదే. కానీ అది మితి మీరినప్పుడే సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. మనిషి ప్రాణానికి మించినది సమాజంలో ఏదీ లేదు కాబట్టి.. పేద పిల్లల కన్నీటి విలువను తెలుసుకోవడం, వారి ప్రాణాలను రక్షించడం ప్రభుత్వాలు, సమాజం కలసి చేయాల్సిన బాధ్యత. కుక్కల సంరక్షణ ఒకపక్క అవసరం అయితే, ప్రజల రక్షణ మరపరానిది. వీధికుక్కల సమస్య ఇప్పుడు చిన్న విషయం కాదు. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట ప్రాణాలు బలవుతున్నాయి. కొంతమంది జంతుప్రేమికుల మాటలతో చేతులు ముడుచుకోవడం సమాజానికి ప్రాణాంతకం. ప్రజల భద్రత ప్రథమ కర్తవ్యం అనే స్పష్టమైన అంగీకారం వస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. లేకపోతే "జంతుప్రీతి అనే పేరుతో మరిన్ని నిరపరాధి ప్రాణాలు బలవుతూనే ఉంటాయి."

# రూల్ ఈస్ రూల్ రూల్‌ఫర్ ఆల్..

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా అంశం పైనా స్పందించారు. 'విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు'' అని అమిత్ షా అన్నారు.



''ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే.. చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోదీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళ్తే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా?'' అని ప్రతిపక్షాలపై హోంమంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు కచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

**నైతికత గురించి నాకు చెప్పొద్దు..**

130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013 నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. ''రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్ గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది'' అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు.

ధన్‌ఖడ్ రాజీనామా.. ఎక్కువగా లాగొద్దు

ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. ''ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతిపక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదు'' అని అమిత్ షా స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ.. ''రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు'' అని తెలిపారు.

# కవిత ఒంటరి

(మొదటి పేజీ తరువాయి)

అని చెబుతున్నారు. కేటీఆర్ తీసుకుంటున్న కీలక నిర్ణయాలకు కవితకు విపరీతమైన అభ్యంతరాలు ఉన్నా, ఆమె మాటకు పెద్దగా ప్రాధాన్యం లభించడం లేదని తెలుస్తోంది. ఈ పరిణామాల్లో ఆశ్చర్యకరమైంది, తండ్రి కేసీఆర్ కూడా ఏకపక్షంగా తన అండ కేటీఆర్ వైపే చూపించడం. గతంలో కవిత పట్ల చూపించిన మద్దతు ఇప్పుడు కనిపించడం లేదు. కేటీఆర్ నిర్ణయాలపైనే కేసీఆర్ ఎక్కువ విశ్వాసం ఉంచుతున్నారని పార్టీ వర్గాల అభిప్రాయం. పార్టీలో మరో ముఖ్యనేత హరీశ్ రావు, అలాగే కేసీఆర్ కుటుంబానికి దగ్గరగా ఉన్న సంతోష్‌రావు కూడా కవిత పక్కన నిలబడటం లేదని తెలుస్తుంది. పార్టీ కీలక వర్గాల్లో కవితకు అనుకూలంగా మాట్లాడేవారు, మద్దతిస్తేవారు కొద్ది మందే. అధికారం, నిర్ణయాధికారాలు పూర్తిగా కేటీఆర్ చేతుల్లోకి వెళ్లడంతో కవిత రాజకీయ భవిష్యత్తుపై అనేక అనిశ్చితులు వ్యక్తమవుతున్నాయి.



అమెరికాలో ఉన్నప్పుడే కీలక నిర్ణయాలు

కవిత అమెరికా పర్యటనలో ఉన్నప్పుడే పార్టీ పెద్దలు ఒక ముఖ్య నిర్ణయం తీసుకున్నారు. కవితకు ఉన్న కార్మిక సంఘం అధ్యక్ష పదవిని తొలగించిన ఘటనపై పార్టీ వర్గాల్లో పెద్ద చర్చ జరిగింది. సీనియర్ నాయకులు కూడా దీనికి సంబంధించి ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. ఈ సంఘటనతో కవితకు పార్టీలో స్థానం బలహీనమవుతుందనే అభిప్రాయం మరింత బలపడింది. ఇటీవల కాలంలో కవితకు పార్టీలో ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోతుందని గమనిస్తున్నాం. సమావేశాలు, కార్యక్రమాల్లో ఆమెకు ఇచ్చే అవకాశాలు కూడా తగ్గుముఖం పట్టాయి. ముఖ్య నిర్ణయాల్లో ఆమెకు స్థానం లేదని తెలుస్తున్నది.

**కేసీఆర్ కోపం..**

కుటుంబ స్థాయిలోనూ కవిత ఇబ్బందులు ఎదుర్కొంటున్నదన్న వార్త ఇప్పుడు ప్రధాన అంశమైంది. రాకీ పండుగ సందర్భంగా కుటుంబ సంప్రదాయంగా కవిత కేటీఆర్ చేతికి రాఖీ కట్టాలని ప్రయత్నించగా, కేటీఆర్ ఆచారాన్ని నిరాకరించినట్లు తెలిసింది. దీంతో కుటుంబంలోనే విభేదాలు బహిర్గతమయ్యాయని భావిస్తున్నారు. ఇంటికి వెళ్లినా కేసీఆర్ ఆమెతో మాట్లాడలేదని విశ్వసనీయంగా తెలిసింది. కేవలం కవిత కుమారుడిని ఆశీర్వదించడం మాత్రమే జరిగిందని చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ కుటుంబ సభ్యుల కోపం కవిత వైపు ఉందని స్పష్టంగా అర్థమవుతోంది.

**కవిత భవిష్యత్తు ఏంటి?**

ఈ పరిస్థితుల్లో కవిత భవిష్యత్తుపై పెద్ద చర్చ మొదలైంది. నిదానంగా ఆమెపై పార్టీ లోపల ఒత్తిడి పెరుగుతున్నట్టుగానే కనిపిస్తోంది. ఒకవైపు పార్టీ నాయకత్వం, మరోవైపు కుటుంబ అనుబంధాలు కవితకు వ్యతిరేఖంగా ఉండటం ఆమె పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తోంది. రానున్న రోజుల్లో కవిత పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా కదులుతుందా? లేక తాను స్వతంత్ర మార్గాన్ని వెతుక్కుంటుందా? అన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో పెరుగుతోంది. బీఆర్‌ఎస్ పార్టీలో అధికారం మొత్తం క్రమంగా కేటీఆర్ చేతుల్లో కేంద్రీకృతమవుతున్న వేళ, ఇతర కుటుంబ సభ్యులకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదు. ముఖ్యంగా కవితపై పార్టీ, కుటుంబం రెండింటి నుండి ఒత్తిడి రావడం, ఆమె రాజకీయాన్ని భవిష్యత్తులో ఎలా మలుపు తిప్పుతుందనే దానిపై అన్ని వర్గాల్లోనూ చర్చ కొనసాగుతోంది. మొత్తం మీద ఒక మాటలో చెప్పాలంటే, బీఆర్‌ఎస్ లో కవిత పరిస్థితి ఇప్పుడు దాదాపు ఒంటరి అయ్యారని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. కవితకు ప్రజల నుంచి కూడా పెద్దగా మద్దతు దక్కడం లేదు. ఒకవేళ ఆమె పార్టీ పెట్టినా ఆమె వెంట నడిచే నాయకులు ఉండకపోవచ్చు. మరి ఈ పరిస్థితుల్లో కవిత ఏం చేయబోతున్నారు? ఆమె రాజకీయభవిష్యత్ ఏమిటి? కొత్త పార్టీ పెడతారా? ఏదైనా వేరే పార్టీలోకి వెళతారా? లేదంటే కేటీఆర్ తో రాజీ కుదుర్చుకొని బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతారా? అన్నది వేచి చూడాలి.



# కాంగ్రెస్ ఎమ్మెల్యే సస్పెండ్

**నటి ఆరోపణలు..**

**జనం పవర్, హైదరాబాద్**

కేరళ కాంగ్రెస్‌లో ఓ నటి చేసిన ఆరోపణలు కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో పార్టీ అతనిపై చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే రాహుల్ మామకుటత్తిల్ ను ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది. ఆయన పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.
ఓ ప్రముఖ పార్టీకి చెందిన యువనేత తనతో అనుచితంగా వ్యవహరిస్తున్నాడని, మూడేళ్లుగా వేధిస్తున్నారంటూ రీని జార్జ్ అనే నటి ఓ ఇంటర్వ్యూలో ఆరోపించారు. ఈవిషయాన్ని పలుమార్లు ఆ పార్టీ సీనియర్ల దృష్టికితీసుకెళ్లినా.. ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. రాహుల్ పేరును ఆమె నేరుగా ప్రస్తావించనప్పటికీ.. భాజపా, సీపీఎం శ్రేణులు ఆయన ప్రమేయం ఉందని ఆరోపించాయి. రాజీనామా చేయాలని నిరసనలు చేపట్టాయి. ఈనేపథ్యంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా ప్రకటించారు.
“నాపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ పెద్దలతో మాట్లాడాను. వారెవరూ నన్ను రాజీనామా చేయాలని డిమాండ్ చేయలేదు. ఆ నటి నా స్నేహితురాలు. ఆమె ఆరోపణలు చేసిన వ్యక్తి నేను కాదని నమ్ముతున్నాను. నేను ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదు'' అని రాజీనామా అనంతరం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయినా విమర్శలు ఆగకపోవడంతో ఇప్పుడు పార్టీ చర్యలు తీసుకుంది.

# ఢిల్లీ ముఖ్యమంత్రి హత్యకు ప్లాన్

**తొలుత కత్తితో పొడవాలనుకున్న నిందితుడు**

**భద్రత కారణంగా దాడి చేయాలని నిర్ణయం**

**రేఖా గుప్తాపై దాడి కేసులో పలు కీలక విషయాలు**

**జనం పవర్, హైదరాబాద్**



దేశ రాజధాని ఢిల్లీలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరగడం ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడు సకారియా రాజేశ్‌భాయ్ ఖీమ్జీభాయ్(41)ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని విచారించగా.. పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీఎంను కత్తితో పొడవాలని నిందితుడు ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం. అయితే భారీ భద్రత కారణంగా తన ప్రణాళికను విరమించుకున్నట్లు సకారియా చెప్పినట్లు తెలుస్తోంది. 'ఢీల్లీలో వీధి కుక్కలను తరలించాలని నేను చాలాసార్లు అభ్యర్థించా. దీని గురించి సీఎం పట్టించుకోకపోవడంతోనే ఆమెపై దాడి చేయాలని నిర్ణయించుకున్నా. సీఎం అధికారిక నివాసానికి వెళ్లడానికి ముందు సుప్రీంకోర్టుకు వెళ్లా. న్యాయస్థానం బయట సెక్యూరిటీని చూసి అక్కడి నుంచి వచ్చేశా. అనంతరం సివిల్ లైన్స్‌లో ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లా. తొలుత ఆమెను కత్తితో పొడవాలని ప్లాన్ చేశా. కానీ, భద్రత ఎక్కువగా ఉండటం చూసి కత్తిని బయటే పడేశా'' అని నిందితుడు సకారియా విచారణలో చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.
ఆగస్టు 20న సివిల్ లైన్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేఖా గుప్తా 'జన్ సున్వాయ్'' కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఫిర్యాదుదారు ముసుగులో వచ్చిన దుండగుడు... పత్రాలను అందిస్తూ.. సీఎంపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. పెద్దగా కేకలు వేస్తూ.. చెంపదెబ్బ కొట్టాడు. ఆమెను వెనక్కి తోసేయడానికి ప్రయత్నించాడు. ఆమె జుట్టును గట్టిగా పట్టుకున్నాడు. తక్షణమే భద్రతా సిబ్బంది జోక్యం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అనూహ్య ఘటనలో ముఖ్యమంత్రి తల, భుజం, చేతులకు గాయాలయ్యాయి.

**మరో నిందితుడి అరెస్ట్..**

ఇక, ఈ ఘటనలో మరో నిందితుడు తహసీన్ సయ్యద్‌ను ఢిల్లీ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇతడు ప్రధాన నిందితుడు సకారియాకు స్నేహితుడిగా గుర్తించారు. దాడి ఘటనలో సకారియాకు సయ్యద్ సాయం చేశాడని, కొంత డబ్బు కూడా పంపించాడని పోలీసులు తెలిపారు. దాడికి ముందు సీఎం నివాసానికి సంబంధించిన వీడియోలను సకారియా తన స్నేహితుడు సయ్యద్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

**రేఖా గుప్తాకు మునుపటి భద్రత..**

కాగా.. దాడి ఘటన కారణంగా ఇటీవల సీఎం రేఖా గుప్తాకు సీఆర్‌పీఎఫ్ జవాన్లతో జడ్ కేటగిరీ భద్రత కల్పించిన సంగతి తెలిసిందే. తాజా దాన్ని తొలగించారు. మునుపటిలాగే ఢిల్లీ పోలీసులు ఆమెకు భద్రత కల్పిస్తారని అధికారిక వర్గాలు సోమవారం వెల్లడించాయి.

# నొయిడా కేసులో కీలక విషయాలు







**రీల్‌చేయరాదు, బ్యూటీ పార్లర్ కూడా తెరవొద్దు**

**ఇవి చేసినందుకు అమెపై కుటుంబం నిప్పంటించారు**

**బిజినెస్ ప్రమోషన్ కోసం యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఛానెళ్లు**

**జనం పవర్, హైదరాబాద్**

అదనపు కట్నం కోసం గ్రేటర్ నోయిడాకు చెందిన వివాహిత నిక్కీని ఆమె భర్త, అత్తమామలు చిత్రహింసలకు గురిచేసి నిప్పంటించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిక్కీ ఆమె సోదరి కాంచన్ గతంలో బ్యూటీ పార్లర్ నడిపేవారని.. కొన్ని రోజుల క్రితం దానిని మూసేశారని పోలీసులు తెలిపారు. తమ బ్యూటీపార్లర్‌ను తిరిగి ప్రారంభించాలని గురువారం నిక్కీ, కాంచన్ ప్లాన్ చేస్తుండగా దానిని విపిన్, అతడి తల్లిదండ్రులు వ్యతిరేకించారు. బ్యూటీపార్లర్ నడపడం, రీల్స్ చేయడం వంటివి తమ కుటుంబసభ్యులు ఇష్టపడరని స్పష్టం చేయడంతో ఇరువురి మధ్య వాదన చోటుచేసుకుందన్నారు. అనంతరం నిక్కీపై తీవ్రంగా దాడి చేసి.. ఆమె ఒంటికి నిప్పంటించినట్లు తెలిపారు. తమ బ్యూటీపార్లర్‌ను ప్రమోట్ చేయడానికి నిక్కీ, కాంచన్ 'మేక్‌ఓవర్ బై కాంచన్' పేరుతో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఛానళ్లను నడిపేవారు. ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 54,500 మంది ఫాలోవర్లు ఉండగా.. నిక్కీ ప్రైవేట్ ఖాతాకు 1,147 మంది ఫాలోవర్లు, కాంచన్ ఖాతాకు 22,000 మంది ఫాలోవర్లు ఉన్నారు. బ్యూటీపార్లర్ నడిపి తాము సంపాదించిన డబ్బు కూడా అత్తింటివారు తీసుకునేవారని కాంచన్ పేర్కొంది.
2016లో తమ ఇద్దరు కుమార్తెలను ఒకే కుటుంబానికి ఇచ్చి వివాహం చేసినప్పటి నుంచి నిక్కీని, కాంచన్‌ను అత్తింటివారు కట్నం కోసం వేధించేవారని వారి తల్లిదండ్రులు పేర్కొన్నారు. అంతేకాకుండా ఇద్దరు అన్నదమ్ములకు వేరే మహిళలతో అక్రమ సంబంధాలు ఉన్నాయని.. ఈ విషయంలో పలుమార్లు కుటుంబంలో గొడవలు అయ్యాయని మృతురాలి సోదరి కాంచన్ తెలిపింది. వివాహ సమయంలో పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చినప్పటికీ అదనపు కట్నం కోసం తరచూ వేధించేవారని ఆవేదన వ్యక్తం చేసింది.

# 6లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**నగరంలోని పురోహితుడిని మోసం చేసిన నేరగాళ్లు**

**జనం పవర్, హైదరాబాద్**



నగరంలో 52 ఏళ్ల పురోహితుడిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. పూజపేరుతో రూ.6లక్షలు కాజేశారు. ఈ ఘటన పాతబస్తీ పురానాపూల్‌లో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ మిలిటరీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నట్లు నేరగాళ్లు చెప్పారు. కల్నల్ సర్ ఆరోగ్యం బాగాలేదని.. 11 రోజుల పూజ కోసం 21 మంది పురోహితులు కావాలని తెలిపారు. అడ్వాన్స్ కింద రూ.3లక్షలు చెల్లిస్తామని చెప్పి.. తొలుత రూ.10 పంపారు. వీడియో కాల్ చేసి మిగతా డబ్బు పంపుతామని నమ్మించి కార్డు, పిన్ వివరాలను తీసుకున్నారు. దాని నుంచి విడతల వారీగా నేరగాళ్లు రూ.5.99లక్షలు కాజేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే 1930కి కాల్ చేశాడు. దీనిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి

**బీసీ రిజర్వేషన్లు, ఫిరాయింపుల అంశంపై చర్చలు**

**జనం పవర్, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు ( మంగళవారం) మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్తున్నారు. ఈ పర్యటనలో ఆయన పలు కీలక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై న్యాయ నిపుణులతో చర్చించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సుప్రీంకోర్టులో వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే న్యాయ నిపుణులను సంప్రదించి వ్యూహరచన చేపట్టాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. రేపటి ఢిల్లీ పర్యటనలో ఈ భేటీ కీలకమవనుంది.

సీఎం ఢిల్లీ పర్యటన అనంతరం ఎల్లుండి బీహార్‌కు వెళ్తారు. అక్కడ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్రలో పాల్గొననున్నారు. ఆయనతో పాటు తెలంగాణ మంత్రులు కూడా హాజరుకానున్నట్లు సమాచారం. రేవంత్ ఢిల్లీ పర్యటన, బీహార్ పాదయాత్రలో పాల్గొనడం కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ సమావేశాలు, మరోవైపు పార్టీ బలపరిచే ప్రయత్నంలో బీహార్ పాదయాత్రలో సీఎం, మంత్రుల భాగస్వామ్యం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

# అమెరికా భారత్ సంబంధాలు మరింత క్షీణిస్తాయా?

**ట్రంప్ వివాదాస్పద నిర్ణయం**

**భారత్ ను తీవ్రంగా వ్యతిరేకించి వ్యక్తికి రాయబారిగా అవకాశం**

**జనం పవర్, హైదరాబాద్**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్‌అమెరికా సంబంధాలు తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 ఏళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీతమైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు. గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అన్నారు. పాకిస్థాన్ సహా పొరుగు దేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టినట్లువుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూఢిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించందన్నారు. అంతేకాదు.. ఇక భారత్‌అమెరికా సంబంధాల్లో ఇండోపసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు.

మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియామకం భారత్‌అమెరికా సంబంధాలను మరింత దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం ట్రంప్‌నకు వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. ట్రంప్ అజెండాను ముందుకు తీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను బలోపేతం చేస్తుందని చెప్పలేమన్నారు. అమెరికా అనుసరించే పాక్‌అఫ్గాన్ పాలసీతో భారత్‌ను కూడా కలపడం ఇబ్బందికరమే అని తెలిపారు.

**నాడు ఒబామా ప్రయత్నాన్ని వ్యతిరేకించిన భారత్..**

2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడి ఉన్న సమయంలో కూడా భారతపాక్‌అఫ్గానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్‌అఫ్గానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్‌లో బహిర్గతమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్ నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు.

**ట్రంప్-మస్క్ వివాదాన్ని ఎగదోసి..**

శ్వేత సౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ నాసా చీఫ్‌గా తొలుత ట్రంప్ ప్రకటించారు. ఆయన నామినేషన్‌ను ఆమోదానికి సెనెట్‌కు పంపే సమయంలో మస్క్‌ట్రంప్ మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. అదే సమయంలో ఇస్సాక్‌మన్ డెమోక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు గోర్ నుంచి ట్రంప్‌కు సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా మస్క్ చివరి రోజున.. నాసా చీఫ్ పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**జనం పవర్, హైదరాబాద్**

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున శ్రీవారి సుప్రభాత సేవలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన కిషన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశమంతటా మంచి వర్షాలు పడ్డాయని తెలిపారు. రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు. సైనికులు పట్టుదలగా, అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. సైనిక శక్తి, దేశ భద్రత మరింత శక్తిమంతంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులపై వెంటనే స్పందించాలని
# అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 25:**

జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలు సమర్పించే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ధర్మారం మండలం ఖిలావనపర్తికి చెందిన ఎం. కవిత తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరగా, కలెక్టర్ వెంటనే పీడీ హౌసింగ్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గడ్డం పుష్పలత గ్రామ శివారులోని 59వ సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి తన కబ్జాలో ఉందని, తనకు పట్టా మంజూరు చేయాలని కోరగా, కలెక్టర్ తహసీల్దార్‌కు రాస్తూ అర్హత మేరకు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు మరియు సంబంధిత విభాగాధిపతులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలి



- బీజేపీ నాయకుల డిమాండ్

**జనం పవర్,కమాన్‌పూర్ ఆగస్టు 25:**

రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను,వెటర్నరీ ఆసుపత్రిని,ప్రభుత్వ పాఠశాలను,ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు.ఈ సందర్భంగా వెటర్నరీ ఆసుపత్రిలో సిబ్బంది కొరత,సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల కొరత,నీటి సరఫరా సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అంగన్వాడి కేంద్రంలో కూడా నీటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిని కలిసి గ్రామ సమస్యలపై వివరాలు తెలుసుకొని,సానిటైజేషన్,డ్రైనేజీ శుభ్రపరిచే పనులు,దోమల నియంత్రణ కోసం స్మోకింగ్ కార్యక్రమాలు జరగకపోవడం వల్ల గ్రామంలో జ్వరాలు విస్తరిస్తున్నాయని,వీటిని తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.అనంతరం మండల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి,సంబంధిత వైద్యుడిని కలిసి ల్యాబ్,మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు.ఇందులో బీపీ మాత్రలు,సీజనల్ వ్యాధులకు సంబంధించి దురదలు,అలర్జీలకు మందులు లేవని వైద్యులు తెలిపారు.ఈ మందులను వెంటనే డిఎంహెచ్వోకు లేఖ రాసి అందుబాటులోకి తెప్పించాలని కోరారు .ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము,మట్ట శంకర్,ఇరువురాల పోషం,జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్‌కుమార్,బర్ల సదానందం,పంతగాని విశ్వతేజ, పెద్దపల్లి శ్యాంసుందర్,పిల్లి చంద్రయ్య,మోర ప్రశాంత్,పిడుగు రమేష్,ఆసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మంథని ఎస్సీ బాలికల ఎస్ఎంహెచ్ హాస్టల్ వార్డెన్ పైన చర్యలు తీసుకోవాలి



- కలెక్టర్ కు వినతిపత్రం
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్

**జనం పవర్, మంథని, ఆగస్టు 25;**

మంథని మండల కేంద్రంలో ని ఎస్సీ బాలికల (ఎస్ఎంఎస్) హాస్టల్ లో గత రెండు సంవత్సరాల నుండి వార్డెన్ గా విధులు నిర్వర్తిస్తు హాస్టల్లో విద్యార్థుల సంఖ్యను పెంచకుండా విద్యార్థులు హాస్టల్లో ప్రవేశం పొందడం లేదు అనే నెపంతో హాస్టల్లో ప్రవేశం పొందిన విద్యార్థులను వార్డెన్ ఇష్టమైన రీతిలో తిట్టడం వలన గత సంవత్సరంలో హాస్టల్లో చేరిన విద్యార్థులు టీసీలు తీసుకొని వేరే హాస్టల్ లో చేరడం జరిగింది అదేవిధంగా గతంలో గోదావరిఖని లోని హాస్టల్ లో విధులు నిర్వహిస్తే అక్కడ ఉన్నటువంటి హాస్టల్ ను కూడా మూసివేంచడం జరిగింది ప్రస్తుతం మంథని ఎస్సీ బాలికల (ఎస్ఎంఎస్) హాస్టల్ లో ఒక విద్యార్థినిని కూడా చేర్చుకోకుండా హాస్టల్ ను మూసివేయలేనే ఆలోచనతో ఏ ఒక్క కాలేజీ విద్యార్థినికి కూడా హాస్టల్ లో ప్రవేశం ఇవ్వలేదని గత రెండు సంవత్సరాల నుండి విధులు నిర్వర్తిన్నాను అని చెప్పి జీతం తీసుకుంటు ఏమాత్రం ఉద్యోగానికి న్యాయం చేయకుండా వ్యవహరించడం జరుగుతుందని ఇలాంటి విషయాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లనే వార్డెన్ హాస్టల్ ను మూసివేయడం జరిగింది. కావున ఇట్టి హాస్టల్ వార్డెన్ పైన సంబంధిత అధికారుల పైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# ప్రభుత్వ నిర్లక్ష్యంపై రేషన్ డీలర్ల ఆగ్రహం

- ఐదు నెలల కమీషన్ బకాయిలతో ఆర్థిక ఇబ్బందులు
- గౌరవ వేతనం,కమీషన్ పెంపు,మినీ సూపర్ మార్కెట్ల గుర్తింపు,ఆరోగ్య భద్రతా సదుపాయాలు,ఎక్స్గ్రేషియా
- రేషన్ డీలర్ల డిమాండ్లు

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 25:**



తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్లు తమపై కొనసాగుతున్న ప్రభుత్వ నిర్లక్ష్యం,పెరుగుతున్న ఆర్థిక భారాన్ని భరించలేక చివరకు ఆందోళన పంథా ఎంచుకున్నారు.ఏప్రిల్ నుండి ఆగస్ట్ వరకు ఐదు నెలలుగా బకాయిగా ఉన్న కమీషన్ ఇప్పటికీ చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టమైందని,రాబోయే వినాయక చవితి,బతుకమ్మ, దసరా పండుగలను జరుపుకోవడానికి కూడా పరిస్థితులు అనుకూలంగా లేవని వారు వాపోయారు. డీలర్లు నెలవారీ కమీషన్ తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని,అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో భాగంగా ప్రకటించిన రూ.5,000 గౌరవ వేతనం,రూ.300 కమీషన్ పెంపును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన సమస్యలతో పాటు రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా అభివృద్ధి చేసి,మరిన్ని నిత్యావసర వస్తువులు పేదలకు అందుబాటులోకి తేవాలని కోరారు.అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే డీలర్ల కుటుంబాలకు హెల్త్ కార్డులు జారీ చేయాలని,బియ్యం రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ,రేషన్ డీలర్ మరణించినప్పుడు కుటుంబానికి రూ.30,000 అంత్యక్రియల సాయం,కరోనా కారణంగా మరణించిన వారికి రూ.20 లక్షల ఎక్స్గ్రేషియా అందించాలని కోరుతున్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని,గోదాముల వద్ద శాశ్వత వే బ్రిడ్జిలు ఏర్పాటు చేసి సరఫరాలో పారదర్శకత తీసుకురావాలని స్పష్టం చేశారు.రేషన్ కార్డుల టైఫెర్గేషన్ విధానాన్ని రద్దు చేయాలని,అవసరమైతే పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో షాపుల సంఖ్యను సవరించాలని సూచించారు. అదనంగా రేషన్ షాపుల అద్దెను ప్రభుత్వమే భరించాలని,ప్రతి రెండు సంవత్సరాలకోసారి రీన్యూవల్ అవసరం లేకుండా శాశ్వత అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.తరుగుదల నష్టాన్ని భర్తీ చేసేందుకు అదనంగా 2% బియ్యం కోటా కేటాయించాలని కూడా కోరుతున్నారు.హైదరాబాద్‌లో రేషన్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి,ఉన్నత విద్యావంతులైన డీలర్లకు పదోన్నతులు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.తమ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించమని ప్రభుత్వాన్ని కోరుతూ,పట్టించుకోకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 5న రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపులను ఒకరోజు బంద్ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రకటించింది.



## బాధితులకు సత్వర న్యాయం చేయండి

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 25**

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్‌డే లో బాగంగా ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో ఎస్పీ స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

# ఉదయం కోడి కూయక ముందే మద్యం విక్రయాలు

- గోదావరిఖనిలో వీధికో బెల్ట్‌షాప్
- కల్తీ మద్యంతో ఆసుపత్రుల పాలవుతున్న కార్మికులు
- ఎక్సైజ్ అధికారుల మౌనం ప్రశ్నార్థకం!

**జనం పవర్,రామగుండం ఆగస్టు 25:**



రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని నగరం పారిశ్రామిక కేంద్రంగా పేరుగాంచినా, ఇక్కడ సింగరేణి, ఎన్టీపీసీ, ఎఫ్సీఐ వంటి పెద్ద పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు కష్టపడి జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఈ పరిస్థితిని లాభదాయకంగా మలచుకున్న మద్యం వ్యాపారులు బెల్ట్‌షాపులను అధిక సంఖ్యలో నడుపుతూ కార్మికులను మద్యానికి బానిసలుగా మార్చేస్తున్నారు. ఉదయం నాలుగు గంటలకే ప్రారంభమయ్యే ఈ అక్రమ విక్రయాల్లో మద్యం ధరలను ఇష్టం వచ్చినట్లుగా పెంచి, సాధారణ రోజుల్లోనే కాకుండా బందు రోజుల్లో 100 రూపాయల మద్యం 150 నుండి 200 రూపాయలకు అమ్ముతున్నారు. గోదావరిఖని నగరంలోనే సుమారు 400కి పైగా బెల్ట్‌షాపులు కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, ఎక్సైజ్ అధికారులు లేదా పోలీసులు పెద్దగా పట్టించుకోకపోవడంతో నిర్వాహకులు మరింత దుస్సాహసానికి పాల్పడుతున్నారు. కల్తీ మద్యం విక్రయాలు విస్తరించి ఊపిరితిత్తులు, లివర్ వ్యాధులతో అనేక మంది కార్మికులు ఆసుపత్రుల పాలవుతున్నారు. అంతేకాకుండా కార్మికుల వద్ద ఉన్న ఏటీఎం కార్డులు, చెక్కుబుక్కులు, వాహనాలు కుదువ పెట్టుకుని 10 నుంచి 20 శాతం వడ్డీలతో డబ్బు వసూలు చేస్తూ వారి జీతాలపై కూడా గట్టి దోపిడీ జరుగుతోంది. రానున్న దసరా, దీపావళి పండుగల బోనసులు, అడ్వాన్సులను కూడా ఈ వ్యాపారులు మింగేస్తారనే భయం కార్మిక కుటుంబాల్లో పెరుగుతోంది. ఇలాగే కొనసాగితే మద్యం బానిసలు అనారోగ్యం పాలై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, బెల్ట్‌షాపులను తక్షణమే అరికట్టి అక్రమ మద్యం సరఫరాను నిలిపివేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 25:**




పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయం ముందు బిజెపి పెద్దపల్లి రూరల్ మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో రైతు సమస్యల పరిష్కారానికి ధర్నా నిర్వహించి, రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. రైతు రుణమాఫీని కేవలం కొంతమందికే చేసి, రెండు లక్షల పైబడిన వారికి రుణమాఫీ చేయకపోవడం, రేషన్ కార్డులను పరిగణలోకి తీసుకొని అన్యాయంగా రుణమాఫీని నిరాకరించడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పినా ఇప్పటికీ ఇవ్వలేదని, కౌలు రైతులకు సంవత్సరానికి ₹15,000 సహాయం చేస్తామని చెప్పి అమలు చేయలేదని, అలాగే రైతు కూలీలకు "ఇందిరమ్మ ఆత్మీయ పథకం" కింద ₹12,000 ఆర్థిక సాయం అందించాలన్న హామీ కూడా మోసపూరితమైందని బిజెపి ఆరోపించింది. వెంటనే ఈ వాగ్దానాలను అమలు చేసి రైతు, రైతు కూలీలకు న్యాయం చేయాలని, లేకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రజలు రోడ్లపైకి రానివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, పెంజర్ల రాకేష్, కారంగుల శ్రీనివాస్, మేకల శ్రీనివాస్, ఈర్ల శంకర్, వల్లె తిరుపతి, సబ్బు మల్లయ్య, మెడగొని శివయ్య, పడాల శ్రీధర్, మామిడి ఉమేష్, గుడ్ల సతీష్, సిరిసేటి కృష్ణమోహన్, రెండ్ల వేణు, బోదాసు అంజి, బొడ్డుపల్లి కుమార్, ముంజ రాజేంద్రప్రసాద్, గాదాసి సతీష్, పోగుల రాజు, నక్క శ్రీనివాస్, కనకట్ల స్వామి, సందన వేన తిరుపతి, ఈదునూరి రవి, ఈదునూరి దేవయ్య, విలాసాగరం కిరణ్, ముక్కెర తిరుపతి, హరీష్, కొప్పుల లక్ష్మణ్, యాదవ్ శశి కుమార్, మహేందర్, కొమ్మ కుమార్, కొమ్మ కరుణాకర్, ఇటికల మహేందర్, రాకేష్, బుర్ర సదానందం, అజయ్ నాయక్, బండారి రాజేందర్, ఆవుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా వినాయక చవితి జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి

- కమాన్‌పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్

**జనం పవర్,కమాన్‌పూర్ ఆగస్టు 25:**




వినాయక చవితి వేడుకలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.కమాన్‌పూర్ మండల సబ్ ఇన్స్పెక్టర్ కొట్టే ప్రసాద్ వివరాలు తెలియజేస్తూ,గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు ముందుగానే ఆన్లైన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయడం తప్పనిసరి అని తెలిపారు.మండపాల వద్ద జరుగే అన్ని కార్యక్రమాలకు కమిటీ అధ్యక్షులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. భద్రతా పరంగా ప్రతి మండపంలో సీసీ కెమెరాలు అమర్చాలని సూచిస్తూ,మద్యం సేవించడం,జూదం ఆడడం,డీజేలు వినిపించడం ,లక్కీ డ్రా నిర్వహించడం వంటి చర్యలు కఠినంగా నిషేధించబడ్డాయని చెప్పారు. అలాగే సోషల్ మీడియాలో అబద్ధపు వార్తలు లేదా తప్పుడు ప్రచారాలు చేయరాదని సూచించారు.నిమజ్జనం రోజున వినాయక విగ్రహాలను తీసుకెళ్లే రహదారుల వివరాలు ముందుగానే పోలీసులకు అందజేయాలని తెలిపారు.ఈ సందర్భంగా ప్రతి మండపాన్ని జియో ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని,భక్తులు,నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు.

# ఆశాలపై అన్యాయం చేస్తోన్న ప్రభుత్వం

- ఎన్నికల హామీలు మర్చిపోయారా?
- ఆరోగ్య సేవల్లో ముందుండి పోరాడుతున్న ఆశాలకు ప్రభుత్వం నిర్లక్ష్యం మాత్రమే!
- ఆశా వర్కర్ల ఆవేదన

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 25:**




తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు ఇంకా పరిష్కారం కాని పరిస్థితిలో, తాజాగా ప్రభుత్వం వారు పని చేయడం లేదని పారితోషికాలను తగ్గించాలనే ఆలోచన అన్యాయం అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్‌సెంటర్ డ్యూటీలు, సర్వేలు, అనేక పారితోషికం లేని పనులు చేస్తూ భారాన్ని భరిస్తున్న ఆశాలు వేతనాలు తగ్గిస్తామనే ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ, ఈ విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పారితోషికాలు తగ్గించకుండా యధావిధిగా ప్రతినెల చివరి నాటికి అకౌంట్లలో జమ చేయాలని, కేంద్రం పెంచిన పారితోషికాలను అమలు చేయాలని, రాష్ట్రం నిర్దేశించిన రూ.18,000/ ఫిక్స్డ్ వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమోషన్ సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. అలాగే 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలనీ, గతంలో సమ్మెల సమయంలో ఇచ్చిన హామీలను, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన వాగ్దానాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు, మట్టిఖర్చులు రూ.50 వేల రూపాయలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు, టార్గెట్లు రద్దు, వేతనంతో కూడిన క్యాజువల్, మెడికల్, ప్రసూతి సెలవులు, క్వాలిటీ యూనిఫారాలు, లెప్రసీ సర్వే పెండింగ్ బకాయిల చెల్లింపు, ఆసుపత్రుల్లో రెస్ట్రూమ్ ఏర్పాటు వంటి అంశాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆశాలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ముమ్మరం చేస్తామని వారు హెచ్చరించారు.

# రైతులందరికీ సరిపడా యూరియాను అందించాలని ఎఓ కు వినతి పత్రం

- **మంథని బిజెపి బిజెపి పార్టీ నాయకులు**

**జనం పవర్, మంథని, ఆగస్టు 25:**



మంథని మండల పరిధిలో ఒక రైతుకు ఒకే యూరియా బస్తా ఇస్తూ....చిన్న సన్న కారు కౌలు రైతులు ఆ ఇచ్చిన యూరియా సరి పోకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రైతులందరికీ తక్షణమే సరిపడా యూరియాను అందించి పంట పొలాలను మరియు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బిజెపి పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంథని వ్యవసాయ శాఖ అధికారినికి పాత పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన యూరియా గోదాం వద్ద ఏఓ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది. అనంతరం మంథని బిజెపి పార్టీ నాయకులు మాట్లాడుతూ మంత్రి ఇలాకాలో యూరియా బస్తాలు లేక రైతులు అవస్థలు పడడం ఏమిటని ప్రశ్నించారు ఒకవైపు అందరికీ సరిపడా యూరియా ఉందని రైతులను మభ్యపెట్టే మాటలు చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు క్యూలో నిలబడి యూరియా బస్తాల కోసం చెప్పులు లైన్ లో పెట్టే పరిస్థితి మంథని లో ఉండడం దౌర్భాగ్యం అని అన్నారు ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యంలో పాలకులు బాగుపడ్డట్టు చరిత్రలో లేదని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మంథని పట్టణ అధ్యక్షులు సబ్బని సంతోష్ బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపాక సత్య ప్రకాష్ మాజీ పట్టణ అధ్యక్షులు బూడిద తిరుపతి పార్టీ సీనియర్ నాయకులు పార్వతి విష్ణు, గుడ్ల గురువేష్ తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ సందర్శణ

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 25**



జగిత్యాల పట్టణ కేంద్రంలోని భవానీ నగర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్. జూనియర్ కాలేజ్ ను నాయకులతో కలసి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సందర్శించారు. హాస్టల్ లోని స్టోర్ రూమ్, వంట గదిని, పరిశీలించి అనంతరం మధ్యాహ్న సమయంలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డ తర్వాత దేశంలో ఎక్కడ లేని విధంగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసుకున్నామని అన్నారు, ఈ 10 సంవత్సరాల్లో విద్యా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత విద్యార్థుల భోజన మెస్ చార్జీలు సరిపోవడం లేదని ప్రభుత్వం 3వ తరగతి నుండి 7వ తరగతి విద్యార్థులకు నాల్లో పాఠశాలలు నిర్వసిస్తున్న విషయాన్ని గమనించిన సీఎం రేవంత్ రెడ్డి జగిత్యాల పట్టణంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ 200 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఈ రోజు విద్యార్థులతో కలసి భోజనం చేశానని, పప్పు, గోరు చిక్కుడుకాయ కూర, పచ్చిపులుసు, పెరుగుతో భోజనం రుచిగా ఉందని ఎమ్మెల్యే సంజయ్ హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజావాణి అర్జీలను పరిష్కరించండి



- **జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 25**

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్, ఆర్డీఓలతో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 48 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, జగిత్యాల, మెట్పల్లి, కోరుట్ల ఆర్డీఓలు మధు సుధన్, శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, వివిధ జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సీతంపేట లో కొండచిలువ హతం

**జనం పవర్, మంథని, ఆగస్టు 25:**



ముత్తారం మండలంలోని సీతంపేట గ్రామ సమీపంలో గొర్ల మంద వద్ద గొర్ల కాపరులు పెద్ద కొండచిలువను హతమార్చారు. గ్రామానికి చెందిన కూరాకుల రాయమల్లు యాదవ్, రజనీకాంత్ యాదవ్ ల గొర్ల మంద వద్ద కొండచిలువ కనిపించగా, గొర్ల కాపర్లు ఆ కొండచిలువను చూసి ఆందోళనకు గురయ్యారు. ఆ కొండచిలువ గొర్రెలను పట్టిందుకు వచ్చిందని గమనించిన గొర్ల కాపర్లు వెంటనే ఆ కొండచిలువను అతి కష్టంగా హతమార్చారు. అటవీ సమీపంలో ఉన్న గ్రామంలోకి కొండచిలువలు ప్రవేశిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే జనహిత పాదయాత్ర

- **మీనాక్షి నటరాజన్**

**జనం పవర్,గంగాధర ఆగస్టు 25:**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లి ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తెలుసుకోవడానికే జనహిత పాదయాత్ర నిర్వహిస్తున్నామని, ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ అలుపెరుగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. పేదల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ కృషి చేస్తుంటే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబానీ, ఆదానీల కోసం మాత్రమే పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు వంటి పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం వేలాది మంది ప్రాణత్యాగం చేయగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణను సాధించిందని గుర్తుచేశారు. పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకొని కాపాడుతామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గంగాధర మండలంలో నిర్వహించిన జనహిత పాదయాత్ర జన సముద్రంలా కనిపించిందని, చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి వేలాదిగా కార్యకర్తలు, మహిళలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేశారని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని పనులను కాంగ్రెస్ పూర్తి చేస్తోందని, పేదల పక్షాన నిలబడుతున్నందుకు ఆ పార్టీ నేతలు కడుపుమంటతో రగిలిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, సబ్సిడీ సిలిండర్లు, ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి కృషి చేస్తోందని చెప్పారు. తెల్ల చొక్కాలు వేసుకుని పెద్ద కార్లలో తిరిగే నేతల కోసం కాకుండా, చెమటోడ్చి పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు న్యాయం చేయడం తమ బాధ్యత అని తెలిపారు. జనహిత పాదయాత్ర విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహేష్ కుమార్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం

- **బీజేపీ కార్యకర్తల ఆందోళన**

**జనం పవర్ ఆగస్టు 25:**

కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చొప్పదండి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో మధుర నగర్ చౌరస్తాలో మహేష్ కుమార్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, “ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్న కేంద్ర మంత్రి సంజయ్ గారిపై ఇలాంటి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ సంస్కారాన్ని చూపిస్తున్నాయి” అని విమర్శించారు. అతను ఇంకా మాట్లాడుతూ, “ప్రజాహిత యాత్ర పేరుతో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది” అని ఆరోపించారు. ఈ ఆందోళనలో రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు, బీజేపీ, బీజేవైఎం నాయకులు భారీగా పాల్గొన్నారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని కార్యకర్తలను అదుపులోకి తీసుకొని గంగాధర, రామడుగు పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# పాలకుర్తి మండలంలో యూరియా కొరత లేదు

- **మండల వ్యవసాయ అధికారి బి. ప్రమోద్‌కుమార్**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 25:**



పాలకుర్తి మండలంలో ప్రస్తుతం యూరియా కొరత ఏమీ లేదని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈ నెలాఖరుకు చిన్నచిన్న సమస్యలు కూడా పూర్తిగా తీరిపోతాయని ఆయన పేర్కొన్నారు. డిమాండుకు అనుగుణంగా యూరియా నిరంతరం సరఫరా చేస్తామని, రైతులు తప్పనిసరిగా నానో యూరియా వినియోగించుకోవాలని సూచించారు. పత్తి, వరి పంటలకు యూరియా వినియోగం ఎక్కువగా ఉండటంతోపాటు సాగు విస్తీర్ణం పెరగడం, కేంద్రం పంపిణీలో ఆలస్యం వంటి కారణాల వల్ల స్వల్ప కొరత ఏర్పడిందని తెలిపారు. కొంతమంది రైతులు అక్రమంగా యూరియా నిల్వలు చేసుకోవడం కఠిన చర్యలకు దారితీస్తుందని, ఇలాంటి సందర్భాల్లో ఇంట్లో నిల్వ ఉంచిన బస్తాలను స్వాధీనం చేసుకుని 6ఏ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం మండలంలోని రెండు పీఏసీఎస్, ఒక డీసీఎంఎస్ కేంద్రాల్లో 10 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఎకరానికి ఒక బస్తా చొప్పున రైతులకు నిరంతరంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ వారం 120 మెట్రిక్ టన్నుల యూరియా కోసం జిల్లా వ్యవసాయ అధికారి, కలెక్టర్ ద్వారా ప్రతిపాదన పంపినట్లు వెల్లడించారు. వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముండడంతో రైతులు ఒక్కసారిగా కాకుండా దఫాలవారీగా యూరియాను వాడి అధిక దిగుబడి సాధించాలని కోరారు. యూరియా కావలసిన వారు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌తో సంబంధిత కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. అలాగే తమ అవసరాన్ని ముందుగానే తమ గ్రామ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియజేయాలని సూచిస్తూ, పాలకుర్తి రైతువేదిక AEO బి.శశిధర్ (7569945212), పుట్నూర్ రైతువేదిక AEO ఎం.యోజన (7569940336), కుక్కలగూడూరు రైతువేదిక AEO జే.సుష్మ (7569948391) ను సంప్రదించవచ్చని తెలిపారు




# స్థానిక సంస్థలలో కాంగ్రెస్ జెండా ఎగరాలి



- **ఎమ్మెల్యే విజయరమణ,ఎమ్మెల్సీ భాను ప్రసాద్**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 25:**

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు,ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్ రావులు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని,పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావు ఇవ్వకుండా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.సోమవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గర్రెపల్లి మాజీ సర్పంచ్ పడాల అజయ్ గౌడ్,వొద్ది ప్రసాద్ రావు,కొక్కిరాల మహేశ్వర్ రావు ఆధ్వర్యంలో సుల్తానాబాద్,ఎలిగేడు,కాల్వ శ్రీరాంపూర్ మండలాలకు చెందిన అనేక మంది మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు,సింగిల్ విండో చైర్మన్లు, వార్డు సభ్యులు,బీజేపీ యువకులు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరగా నేతలు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా పాలన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తోందని,గత పాలకులు చేసిన అప్పులను తీర్చుకుంటూనే సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల కలలను సాకారం చేస్తోందని పేర్కొన్నారు.బీఆర్ఎస్,బీజేపీలు ప్రజలను మభ్యపెడుతున్నప్పటికీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని,రానున్న రోజుల్లో కాంగ్రెస్ పక్షాన తీర్పు ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు మాట్లాడుతూ తాను తెలంగాణ సాధనలో పాత్ర వహించానని,బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కంటే ఆస్తి పెంపుపైనే దృష్టి సారించారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట కోసం రాహుల్ గాంధీ బృందంలోనూ పనిచేశానని,ఇకపై పెద్దపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో కలసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్య గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్లు మినుపాల ప్రకాష్ రావు,ఈర్ల స్వరూప,మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్,పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్,మండల పార్టీ అధ్యక్షుడు చిలుక సతీష్‌తో పాటు వందలాది మంది కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులను అందించడంలో
# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- **సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా**

**జనం పవర్, మంథని, ఆగస్టు 25:**



మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు ఎదుట సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులను అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. రైతులకు ఎరువుల సరఫరా విషయంలో కేంద్రంలోని బిజెపి, ప్రభుత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు కానీ క్షేత్రస్థాయిలో రైతాంగానికి ఎరువులు అందడం లేదని విమర్శించారు. రైతు సహకార బ్యాంకులో యూరియా అందుబాటులో ఉన్నదని యూరియా కొరత లేదని రాష్ట్రంలో మంత్రులు అధికార పార్టీ నాయకులు అధికారులు పత్రికలలో ప్రకటనలు ఇస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు కానీ ఈరోజు మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకులో ఒక్క యూరియా బస్తా లేదని అన్నారు. రైతులు వ్యవసాయ పనులు వదులుకొని ఉదయం నుండి సహకార బ్యాంకుల చుట్టూ తిరుగుతూ పడిగాపులు కాస్తున్నారని కోరమండల్, ఇతర ఫెర్టిలైజర్ షాపు యజమానులు ఇతర ఎరువుల బస్తాలు కొనుగోలు చేస్తేనే యూరియా బస్తాలు ఇస్తామని షరతులు పెడుతున్నారని మండిపడ్డారు. బలవంతంగా ఇతర పెస్టిసైడ్ మందులను అంటగడుతున్నారని విమర్శించారు. అధికారులు ఫెర్టిలైజర్ షాప్ యజమానులు కుమ్మక్కై రైతుల నోట్ల మట్టి కొడుతున్నారని విమర్శించారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని అన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టిసారించి రైతాంగానికి యూరియా అందించాలని లేనిపక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ల సందీప్ గొరెంకల సురేష్ రైతులు పాల్గొన్నారు.




**జనం పవర్, గంగాధర, ఆగస్టు 25:**

**కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో కొత్త తహశీల్దార్‌గా అంబటి రజిత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ (DT), రెవెన్యూ ఇన్స్పెక్టర్లు (RIలు), కార్యాలయ సిబ్బంది ఆమెకు పూల మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజలు, నాయకులు, అధికారులు కలిసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.**

# జనహిత పాదయాత్రతో కాంగ్రెస్‌లో గ్రూపులు సమసిపోయేనా..?

**ఏఐసీసీ ఇంచార్జి, పీసీసీ అధ్యక్షుడు పాదయాత్రలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య కనిపించిన విభేదాలు**

**కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల అయోమయం**

**పాదయాత్రకు ముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి సమీక్షించినా కనిపించని ఐక్యత**



**(జనం పవర్, కరీంనగర్ బ్యూరో)**

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య ఉన్న విభేదాలు ఏఐసీసీ ఇన్చార్జి, పీసీసీ అధ్యక్షులు చేపట్టిన జనహిత పాదయాత్రతోనైన సద్దుమణుగుతుందని నాయకులు భావించినప్పటికీ పాదయాత్రలో మంత్రులు నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయని మరింత స్పష్టమైంది. అందుకు నిదర్శనం ఆదివారం కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలంలో ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్రలో పక్క జిల్లాకు చెందిన మంత్రి పాల్గొన్నప్పటికీ ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యమైన మంత్రి, అనుచరులు దూరంగా ఉండడం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపు విభేదాలు స్పష్టంగా కనిపించాయి.

### పాయాత్రలో కనిపించని మంత్రి, అనుచరులు

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు 19 నెలలు గడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు ప్రజల్లోకి వెళ్లాయా? లేదా? ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎటువంటి అబిప్రాయాలు ఉన్నాయి?. దీంతోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకుల మధ్య ఉన్న దూరం అభిప్రాయ బేధాలను పరిష్కరించడం కోసం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ముఖ్యఅతిథిగా పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా రాష్ట్రంలో కొన్ని నియోజక వర్గాల్లో జనహిత పాదయాత్ర పేరుతో పాదయాత్ర చేపడుతున్నారు. అందులో భాగంగానే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర మండలంలో ఆదివారం సాయంత్రం ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో వాస్తవంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొనాల్సి ఉంది. అయితే ఆదివారం చేపట్టిన జనహిత పాదయాత్రలో మాత్రం జిల్లాకు చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పక్క జిల్లా మంచిర్యాలకు చెందిన మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అనుచరులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పార్టీలో అతి ముఖ్యమైన రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొనలేదు. ఆయనతోపాటు ఆయన అనుచరులైన కుడా చైర్మన్ వెంకట్ రెడ్డి కూడా పాదయాత్రలో కనిపించలేదు. జనహిత పాదయాత్ర చేపట్టిన ముఖ్య ఉద్దేశం జిల్లాలోని మంత్రులు ఎమ్మెల్యేలు నాయకుల మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి అందర్నీ ఐక్యపరచడం కోసం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడం కోసం చేపట్టినప్పటికీ ఆదివారం చేపట్టిన పాదయాత్రలో మంత్రి పాల్గొనక పోవడంతో పాటు ఆయన అనుచరులు పాదయాత్రలో లేకపోవడం వల్ల కార్యకర్తల్లో కొంత అయోమయం నెలకొంది.

### కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి సమీక్షలో కనిపించని ఐక్యత

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్లో ప్రధానంగా మంత్రుల మధ్య ఎమ్మెల్యేలు నాయకుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. అందుకు పార్లమెంట్ ఎన్నికల తో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత మరింత ఎక్కువయ్యాయి. పార్లమెంటు ఎన్నికల తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపెల్లి జిల్లా పెద్దపల్లి పార్లమెంటులో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంవల్ల పెద్దపల్లి పార్లమెంటు కూడా కాంగ్రెస్ కైవాసం చేస్తుంది. ఆ ఎన్నికల్లో అంతా తానై పార్లమెంటు సభ్యుడు కాంగ్రెస్ పార్టీగా గెలిపించిన మంత్రి శ్రీధర్ బాబుకు, ఇటీవలనే మంత్రి బాధ్యతలు చేపట్టిన వివేక్ వెంకటస్వామి ఆయన కొడుకు వంశీకృష్ణకు మధ్య విభేదాలు మొదలయ్యాయి. అవి గత కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా ప్రోటోకాల్ పాటించడం లేదని పేరుతో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వంశీకృష్ణ మధ్య విభేదాలు మరింత పెరిగాయి. అదే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి ఓడిపోవడంతో మంత్రి శ్రీధర్ బాబు మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య మరి విభేదాలు మొదలైనట్టుగా తెలుస్తోంది. ఇది ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో స్పష్టంగా కనిపించింది. కరీంనగర్లో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వేడుకల్లో జిల్లాకు చెందిన బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రాకపోవడం ఆయన వచ్చేలోపు శ్రీధర్ బాబు తన అనుచరుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని వెళ్లడం, అంతకన్నా ముందే పక్క జిల్లాకు చెందిన వివేక్ వెంకటస్వామి జయంతి వేడుకల్లో పాల్గొనడం అదే సందర్భంగా శ్రీధర్ బాబు రావడంతో వివేక్ వెంకటస్వామి మధ్యలో నుండి వెళ్లిపోవడం ఇవన్నీ చూస్తే మంత్రుల మధ్య వివరాలు ఉన్నట్లు కనిపించాయి. ఈ విభేదాలను పరిష్కరించి మంత్రుల మధ్య ఐక్యత మంత్రులు నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతను పెంపొందించడం కోసం నాలుగు రోజుల క్రితం హైదరాబాదులోని తాజ్ కృష్ణ హెూటల్లో కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లాకు చెందిన మంత్రులు ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అయినప్పటికీ కూడా ఆదివారం ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్రలో జిల్లాకు చెందిన అందరూ మంత్రులు పాల్గొనక పోవడం కట్టి చూస్తే మంత్రుల మధ్య విభేదాలు స్పష్టంగా కనిపించింది.

### స్థానిక ఎన్నికల్లో మంత్రులు, నాయకులు కలిసి పనిచేసేనా?

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు ప్రజల్లోకి చేరుతున్నాయా..? ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఎటువంటి అభిప్రాయం ఉంది? తెలుసుకునేందుకు దీంతోపాటు కాంగ్రెసు నాయకులు కార్యకర్తల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అన్ని పదవులను కైవసం చేసుకునేందుకు వ్యూహంలో భాగంగా ఎఐసిసి ఇన్చార్జి మీనాక్షి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ తరఫున జనహిత పాదయాత్ర నిర్వహిస్తున్నారు. అయితే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మాత్రం పాదయాత్రలో ముఖ్యమైన మంత్రులు కలిసి రాకపోవడంతో వారి అనుచరులు, నాయకులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. దీంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీ చైర్మన్లు, జెడ్పి చైర్మన్లు జెడ్పిటిసి, ఎంపీటీసీ, ఎంపీపీ సర్పంచులు వంటి పదవులు అన్నింటిని కైవసం చేసుకోవాలంటే ముఖ్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంపీలు, ఎమ్మెల్సీలు నాయకులు అందరూ కలిసికట్టుగా కలిసి పనిచేస్తేనే అవకాశం ఉంటుంది. లేదంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అప్పటికే టిఆర్ఎస్ బిజెపి పార్టీలు బలంగా ఉండడం వల్ల కాంగ్రెస్లో ఉన్న విభేదాల వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు మరింత బలపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లా మంత్రులందరూ కలిసి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎంపీలు సమ న్యాయంతో చేసి కార్యకర్తలను నాయకులను స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం చేసుకోవాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



సోమవారం జనహిత పాదయాత్రలో భాగంగా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలలోని బాలుర వసతి గృహంలో శ్రమదానం కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ కుమారి మీనాక్షి నటరాజన్‌తో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో పాల్గొన్న పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్.

## యోగా పోటీలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపిక

**జనం పవర్, ధర్మపురి, ఆగస్టు 25:** యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో తేదీ ఆదివారం కోరుట్ల మండలంలోని నలంద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీలలో ధర్మపురి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వాల్గాట్ యశ్వంత్ ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థి యశ్వంత్‌ను ప్రధానోపాధ్యాయుడు పెండ్యాల మహేందర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు కాడే కవిత, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థి వచ్చే నెల 5, 6, 7 తేదీలలో నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నాడు.

## శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఆరంబ్ ఉత్సవాలు




**జనం పవర్, హుజురాబాద్, ఆగస్టు 25:** పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఆరంబ్-2025 ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్, హుజురాబాద్ మున్సిపాల్ కమీషనర్ సమ్మయ్య, కాలేజీ అడ్వైజర్ శ్రీ శాంతన్‌రెడ్డి, కాకతీయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్, విజ్ఞాన్ స్కూల్ కరెస్పాండంట్ దాసరి కోటేశ్వర్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని, చదువు ఆవశ్యకతను తెలియజేస్తూ జీవితంలో ఎలా ఎదగాలో వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ స్థాపించిన సంవత్సరం నుంచి ఇప్పట వరకు నాణ్యమైన విద్యను అందిస్తూ హుజురాబాద్ డివిజన్ చుట్టు పల్లె ప్రజలకు విజ్ఞానం అందిస్తూ డివిజన్లోనే ఏకైక డిగ్రీ కళాశాలగా నడుస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ఇంత ఆనందంగా ఎలా ఉత్సవాలు జరుపుకుంటున్నారో అంతే ఆనందంగా విద్యార్థుల జీవితాల్లో కూడా ఆనందం ఉండాలని, ఎలాంటి తప్పులకు తావు లేదని అమ్మానాన్నలను గురువులను మర్చిపోకుండా మీ గమ్యాన్ని చేరాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

## గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్...**

**ఆక్సపల్లెలో పర్యటించిన కలెక్టర్..**

**ధర్మపురి, జనం పవర్, ఆగస్టు 25:** ధర్మపురి మండలం లోని ఆక్సపల్లె గ్రామపంచాయతీ ప్రాంతంలో గిరిజన తండాలలో సీసీ రోడ్స్, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యంతో పాటు పాఠశాలకు, అంగన్వాడి సెంటర్లకు కరెంటు విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గిరిజన తండాలో మౌలిక వసతుల కల్పన చేపట్టుటకు తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలించారు. సోమవారం మండలంలోని ఆక్సపల్లెలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామ ప్రజలు తమ అవసరాలను జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. గ్రామ పంచాయతీ భవనం, గడ్డం శంకర్ ఇంటి నుండి స్మశాన వాటిక వరకు డ్రైనేజీ నిర్మాణం ,విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు పలు వాడల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, అధికారులు, ఆక్సపల్లె సర్పంచ్, గ్రామ కార్యదర్శి ఉపేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ ఆధ్వర్యంలో టీపీసీసీ చైర్మన్ దిష్టిబొమ్మ దహనం

**జనం పవర్, హుజూరాబాద్, ఆగస్టు 25:** బీజేపీ హుజురాబాద్ పట్టణ మండల శాఖ అధ్యక్షుడు రాముల కుమార్, తుర్పాటి రాజు ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఎంపీలపై నిరాధారా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. తెలంగాణ బీజేపీ 8మంది ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారని నిరాదార ఆరోపణలు చేసి కాంగ్రెస్ పార్టీ భారత రాజ్యాంగం మీద, ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థ మీద దాడి చేశారన్నారు. నిజంగానే బీజేపీ దొంగ ఓట్లు వేయించుకుంటే 240 స్థానాలకు బదులు 400 స్థానాలు వచ్చేవని, మహేష్ కుమార్ గౌడ్ ఇంకిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో పాదయాత్ర చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని మర్చిపోయినట్టున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని గుర్తు చేసుకోండని అన్నారు. బేషరతుగా తెలంగాణలో ఉన్న బీజేపీ ఎంపీలకు ఓట్లు వేసిన ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక సంస్థలలో కర్రుకాల్చి వాత పెడతారని అన్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగాపూర్ అధ్యక్షుడిగా బండ నరేందర్



**జనం పవర్, హుజురాబాద్ టౌన్, ఆగస్టు 25:** సమాచార హక్కు చట్టం హుజురాబాద్ మండలం రంగాపూర్ గ్రామ అధ్యక్షుడిగా బండ నరేందర్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిటీ విధానాలను పటిష్టం చేయడంలో, ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తి స్థాయిలో సేవ చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర అధ్యక్షురాలు సురా స్రవంతి, హుజురాబాద్ మండల అధ్యక్షుడు పల్లె సతీష్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఓట్ చోరీ దీక్షకు వొడితల ప్రణవ్ సంఘీభావం




**జనం పవర్, హుజురాబాద్, ఆగస్టు 25:** కరీంనగర్ పట్టణంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓట్ చోరీ నిరహారదీక్షలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా రాహుల్ గాంధీ ఓట్ చోరీపై ఆధారాలతో నిరూపించారని, దీనిపట్ల ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన చౌరస్తాలో ఇలాంటి దీక్షల వల్ల ప్రజలకు ఓట్ చోరీపై మరింత అవగాహన పెరుగుతుందని అన్నారు.

## ఇందారం సర్పంచ్ స్థానం ఎస్టీలకు కేటాయించాలి



**జనం పవర్, జైపూర్, ఆగస్టు 25:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో ఇందారంలో అధిక శాతం గిరిజనులు ఉన్నారని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఒక్కసారి కూడా ఎస్టీకి రిజర్వేషన్ ఇవ్వలేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ స్థానాన్ని ఎస్టీలకు కేటాయించాలని కోరుతూ ఇందారం యువత కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు చేదా మహేందర్, పెద్ది నరేందర్ చిప్పకుర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు

## పేదలకు ఇల్లు కట్టించాలి..

**జనం పవర్, బైంసా, ఆగస్టు 25:** అర్హులైన పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు కట్టించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బైంసాలోని ఎమ్మార్వో ఆఫీస్‌లో ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్ కు భైంసా పట్టణ, రూరల్ అధ్యక్షులు రాము, సుష్మా రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఇటీవల కురిసిన వానలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, రుణమాఫీ, కొత్త పింఛన్లు, అందిం చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను త్వరలోనే అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# మట్టి వినాయకులనే పూజించాలి

**- కలెక్టర్ స్నేహ శబరీష్**

**- మట్టి ప్రతిమలను పంపిణీ చేసిన కలెక్టర్**




**జనం పవర్, హనుమకొండ, ఆగస్టు 25:** వినాయక చవితి సందర్భంగా మట్టితో చేసిన విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణం పట్ల ప్రజల్ని చైతన్యపరిచే విధంగా గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజిద్దాం అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అధికారులు ప్రారంబించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షిం చాలని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతి జిల్లాకు రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలని చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక



**జనం పవర్, సంగెం, ఆగస్టు 25:** మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాంబయ్య, రవి, రమేష్, రాములు, రజక సంఘం గౌరవ అధ్యక్షుడు ముప్పు సమ్మయ్యతోపాటు కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరినారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గిడుగు రామ్మూర్తి అవార్డు ప్రదానం



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 25:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వనపర్తికి చెందిన సతీష్ యాదవ్‌కు గిడుగు రామ్మూర్తి అవార్డు ప్రదానం చేశారు. సంస్థ సీఈఓ డాక్టర్ యువి రత్నం, డాక్టర్ మురళీ కృష్ణ, డాక్టర్ ధనాసి ఉషారాణి తదితర నిర్వాహకులు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సతీష్ యాదవ్ డాక్టర్ అందుకోవడం తమ మా సంస్థ తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

# అధికార పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**జనం పవర్, సంగెం, ఆగస్టు 25:** అధికార పార్టీ చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మాపురం, గాంధీనగర్, తీగరాజుపల్లి, సోమ్లి తండా, షాపుర్, కొత్తగూడెం, లోహిత, రామచంద్రపురం గ్రామాల్లో బీఆం ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదన్నారు. అన్నం పెట్టే రైతన్న యూరియా దొరకక అరిగోస పడుతున్నారని, అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదంటూ గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ ఎంపీపీ వీరాచారి, జక్క మల్లయ్య, సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 25:** జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం బ్రిందేశ్వర్ ప్రసాద్ మండల్ 107వ జయంతిని వివిధ బీసీ కుల సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్, సామాజిక ఉద్యమ నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ బీపీ మండల్ జయంతిని సామాజిక న్యాయ సాధనా దినంగా బీసీ రిజర్వేషన్ల పోరాటాలను మరింత ఉధృతం చేయడం కోసం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. నేడు గతంలోలా జాతీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లు నిరంతరం వాయిదా వేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ సాధన ఉద్యమానికి బీపీ మండల్ కృషి, త్యాగాలని మననం చేసుకుంటూ బీసీ కమిషన్ 40 సిఫారసులను అమలు చేసే విధంగా ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధ రెండో బీసీ కమిషన్ చైర్మన్‌గా ఆయన బీసీల సామాజిక విద్యాపర వెనుకబాటుపై లోతైన విశ్లేషణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మామిండ్ల ఐలయ్య యాదవ్, కోరే ఎల్లయ్య కురుమ, ఒగ్గు బాల మల్లు కురుమ, ఇరుకోడు సత్తన్న గౌడు, ఆకుల శివకుమార్, యాద నరేందర్ కొత్వాల్, బోయ రాములు, పయ్యావుల ఎల్లం, కాటుక నరసింహులు, పాతుకుల వెంకటేశం, కాముని నగేష్, చింతల మల్లేష్ అడ్వకేట్, ఉడుత రవి, మామిళ్ల రాము యాదవ్, పయ్యావుల రాములు యాదవ్, బొల్లు రాము,, పయ్యావుల శ్యాము యాదవ్ పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం




**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 25:** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సమీపంలో సోమవారం ఉదయం నిర్లక్ష్యంగా, అతి వేగంతో మినరల్ వాటర్ ట్రాలీ ఆటో నడుపుతున్న డ్రైవర్ రోడ్డుకు పక్కన గల ముళ్ల కంప లోయలోకి దించేశాడు. దీంతో ప్రమాదం తృటిలో తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఆటో డ్రైవర్‌గా పెట్టుకునే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, 18 సంవత్సరాలు పైబడిన వ్యక్తి అయి ఉండాలి అని చూడడం లేదు. కనీసం సంవత్సరం ఆటో నడిపిన అనుభవం కూడా లేకపోవడం తో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఆటో ముళ్ల కంప లోయలో ఇరుక్కుపోవడంతో జెసిబి సాయంతో బయటకు తీశారు. దీంతో ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నారు. కాగా వాటర్ ప్లాంట్ యజమాని డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఇతర వ్యక్తిని డ్రైవర్‌గా సృష్టిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు మినరల్ వాటర్ ఆటో డ్రైవర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, లేనిచో ఇలాంటి ప్రమాదాలు జరిగి అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

## తహసీల్దార్‌కు వినతి



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 25:** రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం వనపర్తి డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రాము డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పలువురి రేషన్ డలర్లతో కలిసి వనపర్తి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని రేషన్ డీలర్లకు ఏప్రిల్ నెల నుంచి ఐదు నెలలుగా కమీషన్ రావట్లేదన్నారు. ఐదు నెలల కమీషన్ ఇవ్వాలి ఇవ్వకుంటే వచ్చే నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీలల్లో భాగంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం 5 వేలతో పాటు క్వింటాలుకు రూ.3 వందల కమీషన్ ఇచ్చేందుకు హామీ ఇచ్చారన్నారు. రేషన్ డీలర్లకు కమీషనుకు బదులుగా ప్రతినెల గౌరవ వేతనం రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చశారు. తాము ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. చాలీచాలని ఆదాయంతో కుటుంబా లను పోషించలేని స్థితిలో వుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రోజు రోజుకు మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. షాపు కిరాయి, కరెంటు బిల్లు, హమాలీ చార్జీలు, హెల్పర్ వేతనం చెల్లించడంతో ఏమి మిగలడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రేషన్ షాపులకు కేవలం బియ్యం మాత్రమే ఇస్తుండడంతో అరకొర కమీషన్ వస్తుండడంతో ఆర్థికంగా చాలా నష్టపోతు న్నామన్నారు. కావున ప్రభుత్వం రేషన్ డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.30 వేలు లేదా క్వింటాలుకు మూడు వందల కమీషన్ ఇస్తూ తొమ్మిది రకాల నిత్యావసర వస్తువుల సరఫరా చేయాలన్నారు. రేషన్ డీలర్ అకాల మరణం సంభవిస్తే రూ. 30,వేలు దహన సంస్కారాల నిమిత్తం తక్షణ సహాయం, అస్సూరెన్స్ 10 లక్షల రూపాయలు అందించి డీలరు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. రేషన్ డీలరు షాపులకు వచ్చే సరుకును దింపుడు హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు.. కరోనా సమయాల్లో మరణించిన రేషన్ డీలర్లకు ప్రభుత్వం వెంటనే ఎక్స్రేషియా ఇవ్వాలన్నారు. తూకం తక్కువ బియ్యం బస్తాలను సరఫరా చేస్తున్న వాటిని వాపసు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం వనపర్తి మండల రూలర్ అధ్యక్షుడు నరేష్, వెంకట్ రెడ్డి, ప్రవీణ్, రాఘవేంద్ర, నరసింహారెడ్డి, సత్య రెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా




**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 25:** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు ం సిద్దిపేట కలెక్టరేట్ ఎదు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువరు ఆశా వర్కర్లు మాట్లాడుతూ తామ పనిచేయడం లేదని, పారితోషికాలు తగ్గించాలనే వ్యతిరేక విధానాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని కోరారు. పారితోషికాలు తగ్గించకుండా యదావిధిగా మొత్తం గతంలో చెల్లించినట్లు సకాలంలో చెల్లించాలన్నారు. కేంద్రం పెంచిన పారితోషికాల చెల్లింపు, ఫిక్సిడ్ నేతనం రూ.18 వేలు, ఇతర పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో అనేక సంవత్సరాల నుంచి సమస్యలతో సతమతమవుత్నామని చెప్పారు. ఇకవై సంవత్సరాల నుంచి ఎన్హెచ్ఎం స్కీమ్‌లో భాగంగా రాష్ట్రంలో పని చేస్తున్నామని తెలిపారు. పారితోషికం ఉన్నా లేకున్నా అన్ని పనులు చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్ సెంటర్ డ్యూటీలు, సర్వేలు తదితర అనేక పనులు చేస్తున్నామని పేర్కొన్నారు.. పని భారం అనేక రెట్లు పెరిగి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇంత పనిచేస్తున్న తమను సరిగా పని చేయడం లేదని, పని తగ్గిందని, పారితోషికాలు తగ్గిస్తామని ప్రభుత్వం ఆలోచించడం అన్యాయమన్నారు.. ఈ విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరారు.

## గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి



**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 25:** గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి కుంటుపడిందని బీజేపీ మాడుగులపల్లి మండల అధ్యక్షుడు ఇటికాల జాన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం పలువురు బీజేపీ నాయకులతో కలిసి ఆయన గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ సరోజ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ఈ కార్యక్ర మంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మకంటి నరసింహ, మండల ప్రధాన కార్యద ర్శులు వేముల లక్ష్మణ్, జక్క ఇందిరా, సోషల్ మీడియా కన్వీనర్ దారమల్ల నాగరాజు, యువమోర్చా అధ్యక్షులు రాజవరపు గురు స్వామి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు రాచకొండ దశరథ, చిలుముల శ్రీనివాస్ రెడ్డి,మండల నాయకులు పల్నాటి రామ్ రెడ్డి, బోలగాని ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టు పేరుతో బతుకులను ముంచారు

**కలెక్టరేట్ ప్రజావాణిలో గుండెగాం ప్రజల విజ్ఞప్తి**

**జనం పవర్, భైంసా, ఆగస్టు 25:** భైంసా డివిజన్ పరిధిలోని గుండెగాంలో ఉన్న 470 కుటుంబాలు పల్సికర్ రంగారావు ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురవుతున్నాయని, గత రెండు దశాబ్దాలుగా రైతులు తమ భూములను, ఇల్లులను కోల్పోయి, ప్రతియేటా వర్షాలకు నష్టపోతున్నారని, రూ.94 కోట్లలో, రూ.61 కోట్లు మంజూరై మిగిలిన రూ.33 కోట్లు విడుదల కాక నష్ట పరిహారం, గృహ నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఈ విషయాన్ని రాజకీయ నేతలకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని సోమవారం ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టు పేరుతో బతుకులను ముంచారని వారు ఆరోపించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చినప్పుడే అధికారులకు గుండెగాం గ్రామం గుర్తుకొస్తుంది, కానీ ఇప్పటికీ నిధులను విడుదల చేయక ప్రజలను



ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా పై అధికారులు ఈ విషయంపై స్పందించి వెంటనే నిధులను విడుదల చేయించాలని విన్నవించారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల విభాగం..**

నర్సాపూర్ (జి) మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ వహీద్ పేర్కొన్నారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో మూడు దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. మండలంలో ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఫిర్యాదులు సేకరించడానికి సంబంధిత విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. విభాగాలకు సమావేశంలో నర్సాపూర్ (జి) మండల ఎంపీడీవో పుష్పలత, ఏపీఎం గంగామణి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రిలే దీక్ష



**జనం పవర్, జన్నారం, ఆగస్టు 25:** మంచిర్యాల జిల్లా జన్నారం మండల బీసీ జేఏసీ నాయకులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన దీక్షకు మద్దతుగా జన్నారం మండలం బీసీ నాయకులు సోమవారం జన్నారంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరహార దీక్ష చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ జాగృతి సేన ప్రధాన కార్యదర్శి మామిడి విజయ్ డిమాండ్ చేశారు. లేదంటే బీసీ సంఘాలన్నింటినీ కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మామిడి విజయ్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, కదర్ల నరసయ్య, ఆడపు లక్ష్మీనారాయణ, గూడా అశోక్, పురుషోత్తం, రావుల శంకర్, గోపి, సత్య నారాయణ, ఫజల్, రామన్న, అంజన్న, మల్లయ్య, నల్ల తీగల విష్ణు, ఎలుక రవి, పబ్బతి రాజేష్, రంగు రాకేష్, వంగ సాయి, నేరెళ్ల రాజశేఖర్, జాన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించండి



**జనం పవర్, భైంసా, ఆగస్టు 25:** సమస్యలను పరిష్కరించాలంటూ భైంసా డివిజన్ పరిధిలో ఉన్న రేషన్ డీలర్స్ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంకేత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గత ఐదు నెలలుగా బిల్లులు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్లో ఇచ్చిన హామీ ప్రకారం గౌరవ వేతనం లాంటి హామీలు నెరవేర్చక పోవడం గురించి సబ్ కలెక్టర్‌కు తెలిపారు. బిల్లులు పెండింగ్ ఉన్నా మూడు నెలల బియ్యాన్ని పంపిణీ చేశామన్నారు. కమిషన్ డబ్బులు రాక డీలర్లు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భైంసా రేషన్ డీలర్ల అధ్యక్షుడు గోపాల్ దాస్, ప్రధాన కార్యదర్శి కుంట రాజేశ్వర్, సురేష్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం**



**జనం పవర్, భైంసా, ఆగస్టు 25:** దీర్ఘకాలికంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌ను టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర టీయుడబ్ల్యూజే యూనియన్ ఆదేశాల మేరకు సోమవారం భైంసాలో సబ్ కలెక్టర్‌ను జర్నలిస్టులు కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్ట్‌ల గురించి ఆలోచించి ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరారు. డివిజన్ పరిధిలో చాలామంది జర్నలిస్టులకు ఇల్లు లేక అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ రెడ్డి, భైంసా డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు జావిద్, ఖలీద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కుంటాల, లోకేశ్వరం ఎమ్మార్వోలకు జర్నలిస్టుల వినతి...**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం కుంటాల, లోకేశ్వరం ఎమ్మార్వోలకు టీయూడబ్ల్యూజే యూనియన్ జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. వర్కింగ్ జర్నలిస్టులను ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇబ్బందులను అర్థం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్క జర్నలిస్టు ఇళ్ల స్థలాలను ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంటాల మండలంలో వర్కింగ్ జర్నలిస్టులు రవికుమార్, సాయిబాబా, రాజేందర్ రెడ్డి, రాజు పాల్గొనగా లోకేశ్వరంలో జర్నలిస్టులు రమేష్, నవీన్ కుమార్, రవి కుమార్, సహిద్ తదితరులు పాల్గొన్నారు.






## ఊరిలో ఉన్న భూమి కంచెకు కరెంటు

**భయందోళనలో ప్రజలు.. కనెక్షన్ తొలగించిన విద్యుత్ సిబ్బంది**

**ప్రభుత్వ భూమి పట్టా గా ఎలా మారిందంటున్న ప్రజలు**

**జనం పవర్, మంచిర్యాల, ఆగస్టు 25:** గత 80 సంవత్సరాల నుండి ప్రభుత్వ భూమిగా ఉన్నది ఇప్పుడు ఎలా పక్కాగా మారిందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ గ్రామపంచాయతీకి చెరువుకు మధ్య ఉన్న ప్రాంతంలో గ్రామ ప్రజలే కాక చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల వారు కూడా ఇక్కడికి వచ్చి ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేవారని ప్రజలు అంటున్నారు. అలాంటిది ఉన్నట్టుండి ఈ భూమి ప్రయివేట్ వ్యక్తుల చేతికి ఎలా పోయిందని అడుగుతున్నారు.

**త్రుటిలో తప్పిన ప్రమాదం**

ఆదివారం భట్వానపల్లి గ్రామంలో చెరువుకి ఆనుకొని ఉన్న భూమిలో పొలాల అమావాస్య సందర్భంగా గ్రామస్తులు ఆటకు వెళ్లారు. అక్కడ కంచె వేసి ఉండడంతో ప్రజలు ఆగ్రహంతో కంచెను తొలగించారు. దీంతో ఆ భూమికి సంబంధించిన వ్యక్తులు జే-వైర్‌ను చుట్టూ కంచెగా వేసి దానికి కరెంటును అమర్చారు. సోమవారం ఉదయం అటుగా వచ్చిన రత్నం జనార్దన్ అనే వ్యక్తికి కరెంటు షాక్ తగలడంతో ఆయన అప్రమత్తమై గ్రామస్తులకు తెలిపాడు. దాంతో ఊరంతా అక్కడకు చేరుకొని విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగా వారు స్తంబానికి ఉన్న కనెక్షన్‌ను తొలగించారు.

**కరెంటు తీగలు అమర్చడం నేరం..**

ఉరి నడిబొడ్డున ఉన్న భూమిలో కంచె వేయడం సబబే. కానీ దానికి కరెంటు తగిలించి ప్రాణాంతకమైన పనికి పూనుకోవడం నేరం అని పోలీసులు తెలిపారు. కంచెను తొలగించిన వారి పైన, అదే విధంగా కరెంటు కనెక్షన్ వేసిన వారిపైన కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## పేకాట స్థావరంపై దాడి.. ముగ్గురి అరెస్టు

**జనం పవర్, జైపూర్, ఆగస్టు 25:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని నర్వ గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి మూడు మొబైల్ ఫోన్లు, రూ.14,100లు స్వాధీనం చేసుకున్నారు. జైపూర్ ఎస్ఐ శ్రీధర్ నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25:** ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రైటర్ బస్తిలో ఉన్న సేవాలాల్ మహారాజ్ విద్యార్థి నిలయంలో జరిగిన సేవా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం డీస్పీ అబ్దుల్ రహమాన్, 1టౌన్ సీఐ కరుణాకర్ పాల్గొని విద్యార్థులకు బ్యాగులను అందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఫౌండేషన్ శ్రీకాంత్ లడ్డు, టీం మెంబెర్స్ శివ, ఉదయ్, సుధీర్ బాబు, సత్యసాయి, కౌశిక్, ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**జనం పవర్, భైంసా, ఆగస్టు 25:** భైంసా పట్టణంలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సోమవారం 8 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే రామారావు పటేల్ పంపిణీ చేశారు. భైంసా పట్టణానికి చెందిన సాయి కిరణ్, సరస్వతి, గణేష్, గాయత్రి, యోగేష్, భూమన్న, మీనా, రమేష్ లకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని పేర్కొన్నారు. ఆపద సమయంలో అండగా ఉండాలని సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు.

## 20 కిలోల బంగారం తాకట్టు

**- పరారైన ఎస్బీఐ క్యాషియర్**




**జనం పవర్, చెన్నూరు, ఆగస్టు 25:** మంచిర్యాల జిల్లా చెన్నూరులోని ఎస్బీఐ బ్యాంకు క్యాషియర్ రవీందర్ సుమారు 20 కిలోల బంగారంను తాకట్టు పెట్టారు. ప్రస్తుతం పరారీలో ఉన్న క్యాషియర్ బ్యాంకులో కస్టమర్లు తాకట్టు పెట్టిన 20 కిలోల బంగారు ఆభరణాలను మరో చోట తాకట్టు పెట్టినట్లు సమాచారం. దీంతో బ్యాంకు ఎదుట సుమారు 400 మంది ఖాతాదారులు సోమారం ధర్నా చేశారు. తమ బంగారం ఏమైందో చెప్పాలని, లోన్లు మాఫీ చేసి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు అధికారులు న్యాయం చేస్తామని హామినివ్వడంతో ధర్నా విరమించారు.

## రూప్లా నాయక్ ఆధ్వర్యంలో సేవలు అభినందనీయం

**విద్యార్థులకు బ్యాగుల పంపిణీలో ఎస్సై రమణారెడ్డి**




**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25:** నిస్వార్థ సేవే ఏకైక లక్ష్యంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న రూప్లా నాయక్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సై రమణారెడ్డి అన్నారు. రూప్లా నాయక్ ఆధ్వర్యంలో చేతన ఫౌండేషన్ సహకారంతో లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ఎంపీయుపిఎస్ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎస్సై రమణారెడ్డి చేతుల మీదుగా బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రూప్లా నాయక్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని, పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటున్న రూప్లా నాయక్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు రషీద్, ప్రధానోపాధ్యాయులు జీవన్ కుమార్, గ్రామస్తులు మాధవరావు, కిషన్, వెంకన్న, బిక్కులాల్, శోభ, కవిత, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

**జనం పవర్, సిద్దిపేట జిల్లా ఆగస్టు 25 :** సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘ ఆధ్వర్యంలో స్థానిక స్టేడియం మైదానంలో జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, వెంకట నర్సయ్య ప్రారంభించారు. అండర్ 14, 16, 18, 20 బాలబాలికలు పరుగు, జంప్స్, త్రోస్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, సంఘ బాధ్యులు నిశాంక్ గౌడ్, సాగర్, రాజు, లీలఆనంద్, లక్ష్మన్, శంకర్ పాండ్య, యెశ్వంత్, ఉమేష్, గణేష్ పీడీలు ప్రవీణ్, సురేష్, కనకరాజు, శారద తదితరులు పాల్గొన్నారు.

# ఉపయోగంలోకి వచ్చిన ప్రభుత్వ ఐటిఐ భవనం




- **కలెక్టర్ చొరవతో నర్సింగ్ తరగతులు ప్రారంభం**
- **విద్యార్థులకు విశాలమైన హాస్టల్ భవనం**
- **రక్షణ కొరకు చుట్టూ ప్రహరీ ఏర్పాటు**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి అనుకొని ఉన్న చుంచుపల్లి మండల పరిధిలోని చుంచుపల్లి తండా ఏరియాలో గిరిజన విద్యార్థులకు ఎలక్ట్రికల్ ఇతర విభాగాల్లో విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మితమైన ఐటిఐ భవనం కొన్ని ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. అంతేకాకుండా ఈ ఐటిఐ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. పూర్తయిన ఐటిఐ భవనంను ఆ డిపార్ట్మెంట్ సకాలంలో స్వాధీనం చేసుకొని కారణంగా నిరుపయోగంగా ఉండి ఎందుకు పనికిరాకుండా పోతుంది. అయితే నర్సింగ్ విద్యార్థుల కొరకు హాస్టల్ తరగతుల భవనం నిర్మాణంలో ఉండి పూర్తికాలేదు. అద్దె భవనంలో నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు ఉండడం వల్ల ప్రభుత్వానికి అద్దె భారమైంది. దీంతో చుంచుపల్లి తండాలో ఐటిఐ విద్యార్థులకు నిర్మించిన ప్రభుత్వ భవనం నిరుపయోగంగా ఉండడంవల్ల ఆ భవనాన్ని గుర్తించిన కలెక్టర్ జితేష్ పాటిల్ నర్సింగ్ విద్యార్థుల కొరకు తాత్కాలికంగా కేటాయించడం జరిగింది. ఈ ఐటిఐ భవనంలో నర్సింగ్ విద్యార్థులకు కావలసిన సదుపాయాలను కల్పించడంతోపాటు భవనం చుట్టూ రక్షణకు ప్రహరీ సైతం నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. విశాలమైన భవనాన్ని నర్సింగ్ విద్యార్థుల కొరకు కేటాయించిన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్‌కు విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

# ఆయన ఎవరికీ చుట్టం కాదు..!

## కానీ అందరి వాడు...?

**జనం పవర్, వరంగల్ బ్యూరో:**
ఆయన ఎవరికీ చుట్టం కాదు..అలా అని ఆయన కూడా ఎవరికీ చుట్టం కాదు.. కానీ ఆయన అందరివాడు. అందరి కోసం జాగరణ చేస్తుంటాడు. ఆయన దేనికీ అదరడు.. బెదరడు ఊరంతా గాఢనిద్రలో జోగుతున్నా ఆయన మాత్రం అందరికీ రక్షణగా నిలుస్తాడు.. అయినా అయనను ఒక్కరు కూడా ఏ రోజు తిన్నావా బాగున్నావా అని అడిగే వారుండరు. అపర రాత్రులు తిరుగుతూ అందరికీ కాపలదారిగా బాధ్యత తీసుకుంటాడు.
ఆయన వృత్తి. ఆయనకు ప్రతి రోజు కాళ రాత్రే. ఆయనకు ఏమైనా ఎవరూ బాధ్యత తీసుకోరు. అంతేకాదు ప్రభుత్వాలు కూడా స్పందించిన దాఖలాలు లేవు. అయినా ఏ రోజూ ఆయన ముఖంలో నిరాశ నిస్పృహలు కనిపించవు. ఇది నా కర్తవ్యం అనే భావన మాత్రమే ఆయన ముఖంలో కనిపిస్తుంది. కాఖీ డ్రెస్సు, నోట్లో విజిల్ (మనం వాడుక భాషలో పీక అంటాం) చేతిలో కర్రతో ఆయన ఇంటింటికీ తిరుగుతూ కర్ర శబ్దం చేస్తూ



నేనున్నా..! ఏం భయపడకండి సంతోషంగా నిద్రపోండి. ఏదున్నా నేను చూసుకుంటా..!! అని చేతిలోని కర్రతో0 శబ్దం చేస్తూ మనలో ధైర్యాన్ని నింపుతాడు. అప్పుడు హమ్మయ్యా..! ఆయనొచ్చాడని ధైర్యంగా నిద్రలోకి జారుకుంటాం. బతకడం కోసం దేశం విడిచి, ఊరు కాని ఊరొచ్చి అష్టకష్టాలు పడుతున్నా మనం వాళ్ళ గురించి ఇసుమంతనైనా జాలి చూపం.. ఎందుకంటే స్వేచ్ఛ కావాలి. అన్నీ కావాలి అనే స్వభావం మనది కాబట్టి. ఎన్నో ఏళ్లుగా మనకు, మన ఊరును కాపాడుతున్న గూర్ఖాకు ప్రతి నెల రూ. 10 లు ఇవ్వడానికి వెనకాడుతారు. రేపురాపో.. ఎల్లుండి రాపో అంటూ వాయిదాలు వేస్తూ తిప్పుకుంటారు. అయినా ఈ జీవిత మింతేలే అని మనసులో అనుకుని ఎదురు మాట్లాడకుండా వచ్చిన దారిన వెళ్ళిపోతాడు గూరా?. ఇలా అనేక మంది చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కొందరిచ్చిన సాయంతోనే ఆయన కుటుంబం గడుస్తుంది. వచ్చిరాని తెలుగు భాషతో ప్రజల్ని చేయిచాచి సాయం కోరతాడు. స్పందించిన వాళ్లలో కొందరిచ్చే డబ్బులతోనే వాళ్ళ దయనందిన జీవనం ఒడిదుడుకుల మధ్య కొనసాగుతుంది. బతుకు దెరువు కోసం వచ్చిన గూర్ఖాల సంఖ్య వేళ్ళమీద లెక్కించే విధంగానే ఉంటుంది. మన మీద ఆధారపడి బతుకుతున్న వలస దయనీయ బతుకులను మానవత్వంతో ఆదుకుందాం. అంతేకాదు ప్రభుత్వం కూడా వాళ్ళ దయనీయ జీవన పరిస్థితులను పట్టించుకోవాలని మానవతా వాదులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ అసమర్ధ పాలన వల్లే యూరియా కొరత

## మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**జనం పవర్, నకిరేకల్, ఆగస్టు 25:** కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు రోజులు తరబడి ఎరువుల కోసం క్యూలలో నిలబడి అవస్థలు పడుతున్న పరిస్థితి పూర్తిగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. నాలుగు నెలల క్రితమే రైతుల అవసరాలు తెలిసినా, ఎరువులను సమయానికి రప్పించడంలో ప్రభుత్వం విఫలమైందనీ యూరియా నిల్వలు ముందుగానే చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డికి రైతుల సమస్యలపై అసలు పట్టింపు లేదు.రైతుల కోసం సీఎం సమయానికి నిర్ణయాలు తీసుకోవాలి కానీ, ఈ ప్రభుత్వం ఫోటోలు, ప్రచారాలతోనే బిజీగా ఉంది. కేంద్రం నుండి యూరియా కోటా రప్పించడంలోనూ కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేసింది.పేద రైతులు, కౌలు రైతులు ఎరువులు దొరకక పంటలు నాశనమవుతున్నాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది.సమయానికి యూరియా, విత్తనాలు అందించి, రైతు బంధు, రైతు భీమా, ఉచిత 24 గంటల కరెంట్‌తో రైతుకు అండగా నిలిచిందన్నారు. పతీ సీజన్ తగినట్లు ఎమ్మెల్యేలు మంత్రులు అధికారులతో సమీక్షలు నిర్వహించేవారన్నారు. .ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందే చర్యలు తీసుకునేది కానీ రాష్ట్రంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయన్నారు. .రైతు కోసం యూరియా దొరకడం లేదు, దళారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. .దళారీ వ్యవస్థను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నారన్నారు..చంటిబిడ్డలతో లైన్లో నిలబడి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారరి చెప్పారు. రేవంత్ రెడ్డి వల్లే రాష్ట్రం దివాలా తీసిందన్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ మండల అధ్యక్షుడిగా సతీష్ కుమార్



**జనం పవర్, హనుమకొండ, ఆగస్టు 25:** సమాచార హక్కు చట్టం ఎల్కతుర్తి మండల అధ్యక్షునిగా ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామానికి చెందిన ఎర్రోల్ల సతీష్ నీ నియమిస్తూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.. ఈ కమిటీ ప్రజల కులాలు ప్రవేశం చేందుకు, సమాచార హక్కు చట్టం ఆర్టిఐ ద్వారా ప్రభుత్వాన్ని నిబ్బందాల ప్రకారం పౌరులకు లభించాల్సిన ప్రయోజనాలను పొందడంలో సహాయపడేందుకు కృషి చేస్తుంది ముఖ్యంగా శివశక్తి, అసూ శక్తి రంగాలలో పనిచేస్తున్న ప్రజల గృహ కుటుంబ సమస్యలు పరిష్కరించేందుకు వారి సంక్షేమానికి నిబద్ధతగా పనిచేస్తుంది ఈ సందర్భంగా తన నియామకం పట్ల ఎర్రోల్ల సతీష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిటీ విధానాలను పటిష్టం చేయ డంలో ప్రజలకు అందుబాటులో ఉండే సేవలు అందించడంలో తన పూర్తి సేవను అంకితం గా ఉపయోగించుకుంటానని తెలిపారు అదేవిధంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ కి, రాష్ట్ర అధ్యక్షులు సురా స్రవంతికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ హుజు రాబాద్ మండల అధ్యక్షులు పల్లె సతీష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## దశదిన కర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే



**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 25:** మాడుగులపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వీరాబోయిన నాగరాజు తండ్రి వీరబోయిన కొటయ్య దశదిన కర్మకు నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ హాజరయ్యారు. కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిచారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పగిల్ల సైదులు ,ప్రధాన కార్యదర్శి చింతరెడ్డి యాదగిరి రెడ్డి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, తవిటి సైదులు, లక్ష్మణ్, కృపాకర్, జూలకంటి రాంచంద్రా రెడ్డి, పానుగుండ్ల శ్రీను,కొండేటి సతీష్,నాగయ్య,కొండేటి మధు, కొండేటి నాగయ్య, నల్లబోతు సైదులు,బోడ మల్లేష్,వీరబోయినా సాలయ్య, వీరబోయిన పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

### సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 25:** డ్రగ్స్ మహమ్మారిని సిద్దిపేట జిల్లా నుంచి తరిమికొట్టి డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సిద్ధిపేట ఏసీపీ రవీం దర్ రెడ్డి పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ నిర్మూలన లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులకు యువతను ప్రోత్సహించే విధంగా క్రికెట్, వాలీబాల్ జూనియర్ కళాశాల గ్రౌండ్లో క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపి రవీందర్ రెడ్డి, మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లా కమిషనర్ ఆదేశాల మేరకు నేటి యువతరాన్ని మారకద్రవ్యాలకు దూరంగా చెడు వ్యసనాలకు విడి ఆటలు మన సంస్కృతి వైపు మళ్ళించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు బెజ్జంకి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలలో యువకులను ప్రోత్సహించే విధంగా 19 క్రికెట్ టీమ్స్ 6 వాలీబాల్ టీమ్స్ తో టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మారక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వాములుగా అవుతామని మాతోపాటు ఏ ఒక్కరికి కూడా డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తామని, డ్రగ్స్ అమ్మకము, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తామని ఈ సందర్భంగా క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సౌజన్య లతోపాటు పోలీసు సిబ్బంది వివిధ గ్రామాల నుండి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 25 :** సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ మేరకు గణపతి నవరాత్రి మండపాలకు తప్పతిసరిగా అనుమతి తీసుకోవానలి కోహెడ ఎస్సై అభిలాష్ తెలిపారు. పర్యావరణానికి ముప్పు లేకుండా సహజసిద్ధంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. కమిటీ వారి వివరాలు పోలీస్ స్టేషన్ లో తెలియపరచాలన్నారు. ఉత్సవాలు ఎన్ని రోజుల నిర్వహిస్తారో నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం వివరాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

## జనం పవర్ దినపత్రిక ఆవిష్కరించిన బీఆర్ఎస్ నాయకులు



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 25:** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే హరీష్ రావు క్యాంప్ కార్యాలయంలో సోమవారం జనం పవర్ దినపత్రికను బీఆర్ఎస్ నాయకులు, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. జనం పవర్ జనాల్లోకి రావడం చాలా సంతోషమన్నారు. పత్రిక దినాదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజల పక్షాల ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండలలోని పలువురు మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొనారు.

## సరిపడా యూరియా పంపిణీ చేయాలి




**జనం పవర్, చింతపల్లి (నల్గొండ) ఆగస్టు 25:** రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఊడిగుంట్ల రాములు డిమాండ్ చేశారు. చింతపల్లి మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అగ్రికల్చర్ ఏవో ఆఫీస్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు వచ్చినాక రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అదేవిధంగా రైతులు వ్యవసాయ సీజన్లో ఎరువులు లేక నానా తంటలు పడుతున్నారు. రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని కోరారు రాష్ట్రంలో కావాల్సిన యూరియా 9 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా కేవలం వచ్చిన5 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కూడా సరఫరా చేయలేకపోతున్నారని అన్నారు. సాగు చేసిన భూమికి సరిపడా యూరియా లేక రైతులు బారులు తీరి పడిగాపులు కాస్తున్నారు. పాలకులు పట్టించుకోవడం లేదు ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకొని రైతుల పక్షాననిలబడాలని కోరారు. అగ్రికల్చర్ ఏవో ఆఫీస్ ముందు ధర్నా చేసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోలే యాదయ్య, సిఐటియు నాయకులు ఎండి సర్దార్, సిపిఎం మండల నాయకులు బ్రహ్మం, కడారి కృష్ణయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కమీషన్ విడుదల చేయాలని రేషన్ డీలర్ల వినతి



**జనం పవర్, పటాన్‌చెరు (జిన్నారం), ఆగస్టు 25:** జిన్నారం ఐరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ కమీషన్ విడుదల చేయలని రేషన్ డీలర్ల యూనియన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పభుత్వం నుండి రావలసిన కమిషన్ గత ఐదు నెలలుగా విడుదల కానందున వెంటనే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 17,200 మంది రేషన్ డీలర్లు పనిచేస్తున్నారు. ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు కమిషన్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అసోసియేషన్ పేర్కొంది. ఏప్రిల్, మే నెలల్లో బియ్యం పంపిణీ చేసిన తర్వాత జూన్ నుండి ఆగస్టు వరకు మూడు నెలల బియ్యాన్ని ఉదయం 7 నుండి 10 గంటల వరకు పారదర్శకంగా అందజేశామని డీలర్లు గుర్తుచేశారు. అయితే ఇప్పటి వరకు ఒక్క నెల కమిషన్ కూడా ఖాతాల్లో జమ కాకపోవడం వల్ల కుటుంబ పోషణలో కష్టాలు తలెత్తుతున్నాయని మండల రేషన్ డీలర్ల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేరువేరుగా కాకుండా పాత పద్ధతిలో ఒకేసారి కమిషన్ విడుదల చేసి డీలర్ల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## సురవరం జీవితం స్ఫూర్తివంతం

**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 25:** సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. సురవరం 73వ వర్ధంతి పురస్కరించుకొని కళా వేదిక పక్షాన సోమవారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాటాడుతూ తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాషా అభ్యున్నతి కోసం గోల్కొండ పత్రిక ద్వారా విశేషమైన కృషిని సాగించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఇఓ మద్దిలేటి, జిహెచ్ ఎం శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావు, సాహితీవేత్తలు బైరోజు చంద్రశేఖర్, శాంతన్న, డా.శ్యాం సుందర్, గంధం నాగరాజు, రాజారెడ్డి, భాను చందర్, మెకానిక్ శ్రీనివాసులు, జయంత్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులు

**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 25:** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం శెట్లూర్ ఎంపీపీఎస్‌లోని 21 మంది విద్యా ర్థులు మధ్యాహ్న భోజనం తిని ఫుడ్ పాయిజన్‌కు సోమ వారం 28 మంది హాజరు కాగా అందులో నుంచి 21 మంది విద్యార్థిని విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత వాంతులు కావడంతో హుటాహుటిన బి చ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా 21 మంది విద్యార్థులను తరలించారు. ఈ సందర్భంగా ఇం చార్జ్ ఇన్చార్జ్ స్వప్న తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్న భోజ నం మెనూ ప్రకారం కిచిడి చారు, గుడ్లను విద్యా ర్థులకు అందజేసినట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం బిచ్కుందలో టిఎల్ఎంపై వెళ్లానని వివరణ తెలిపారు. కాగా విద్యా ర్థులను అడగగా ఈరోజు మధ్యాహ్న భోజనంలో వండిన కిచిడీలో మిల్ మేకర్ సరిగా ఉడకకపోవడంతో పాటు చారులో ఉప్పు శాతం అధికంగా ఉండడంతో దానికి తోడు వడ్డించిన అన్నంలో పురుగులు ఉండడంతో అది తిన్న తర్వాత విపరీతంగా వాంతులకు గురయ్యామని అన్నారు. ఈ విషయంలో బిచ్కుంద తహసీల్దార్ వేణుగోపాల్ దృష్టికి తీసుక వెళ్లగా ఏవైతే బియ్యం ఉన్నాయా వాటిని రీప్లేస్మెంట్ చేసి ఇస్తామని తెలిపారు. డాక్టర్లు తెలిపిన వివరాల ప్రకా రం అస్వస్థకు గురైన విద్యార్థులు అందరూ బాగానే ఉన్న



ట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లా డుతూ ఇకపై ఇలాంటి నాసిరకం బియ్యం వండి పిల్లలకు పెట్టరాదని అనుభవం ఉన్న వారితో మాత్రమే వంటలను చేయించి విద్యార్థులకు అందజేయాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రత్యేక పూర్తి విచారణ జరిపి సంబంధిత అధికారులపై ఏజెన్సీ వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ భారత్, ఆర్ఐ రవీందర్, కుశాల్, ఎస్సై మోహన్ రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ స్వప్నాలి, స్టాఫ్ నర్స్ నాగమణి, పవన్, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, సూపర్వైజర్ మోహిన్, తదితరులు ఉన్నారు.

# మట్టి విగ్రహాలనే పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం

## వినాయక చవితి ఏర్పాట్లపై నిర్వాహకులతో సమావేశం

**జనం పవర్, పటాన్‌చెరు (గడ్డపోతారం), ఆగస్టు 25:** వినాయక చవితి పండుగను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించాలని గడ్డపోతారం మున్సిపల్ కమిష నర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వా హకులతో సమావేశం జరిగింది. అధికారులు పలు సూచ నలు చేస్తూ పూజా కార్యక్రమాల కోసం మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. మండపాలను పోలీసు శాఖ అనుమతితో ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ అవసరాల కోసం అధికారిక కనెక్షన్‌ను విద్యుత్ శాఖ ద్వారా పొందాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగ కుండా నీటి డ్రమ్ములు సిద్ధం చేసుకోవాలన్నారు. శబ్ద కాలు ష్యం నివారించడానికి భక్తి గీతాలతో ఉత్సవాలను నిర్వహిం చాలన్నారు. మున్సిపల్ విభాగం తరఫున వీధి లైట్లు, బ్లీచింగ్ పౌడర్, పారిశుద్ధ్య చర్యలు చేపడతామని అధికా రులు తెలిపారు. పూలు, వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా డ్రమ్ములలో వేసి మున్సిపల్ ట్రాక్టర్లకు అందించాలని సూచించారు. అన్నదాన కార్యక్రమాల అన ంతరం వాడిన ప్లేట్లను కూడా మున్సిపల్ సిబ్బందికి



అప్పగించాలని చెప్పారు. నిమజ్జన ఊరేగింపులు ప్రశాం తంగా సాగేందుకు నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినాయక చవితిని కలసికట్టుగా, పర్యావ రణహితంగా జరుపుకోవాలని నిర్ణయించారు.

**జిన్నారంలో శాంతి సమావేశం..**

జిన్నారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం గణేష్ నవరాత్రుల సందర్భంగా శాంతి సమావేశం జరి గింది. ఈ సందర్భంగా సీఐ నయీముద్దీన్ మాట్లాడుతూ, గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ అను మతి తీసుకోవాలని సూచించారు. ప్రశాంత వాతా వరణంలో ఉత్సవాలు జరగడానికి అందరూ సహకరి ంచాలని పిలుపునిచ్చారు.

ఎస్సై హనుమంతు మాట్లాడుతూ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. లాఅండ్ ఆర్డర్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గణేష్ మండప నిర్వాహకులు, విద్యుత్ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన

**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 25 :** జిల్లాలోని కేసీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాల గురించి సిద్దిపేట టూ టౌన్ ఎస్ఐ రాజేష్, ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్, సిద్దిపేట షీటీ మ్ బృందం అవగాహన కల్పించారు. అధికారులు మాటా ్లడుతూ కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ మేడమ్ గారి ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూ ల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి సైబర్ నేరాలు మన తప్పిదాల వల్లే జరుగుతున్నాయి గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయవద్దు, గూగుల్ పే ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించేటప్పుడు తగు జాగ్రత్త చర్య లు తీసుకోవాలన్నారు.

బ్యాంకు అధికారులు ఎవరూ మన వివ రాలు ఎప్పుడు కూడా అడగరు, బ్యాంకు ఖాతా ఓకే ఓపెన్ చేసేటప్పుడే మన ఆధార్ కార్డు పాన్ కార్డు అన్ని వివరాలు ఐడి ప్రూఫ్ తీసుకొని మనకు అకౌంట్ ఇస్తారు, వాళ్లు ఎప్పుడు కూడా ఆ వివరాలు అడగరు, ప్రతి ఒక్కరూ ఇది గమనించాలి. ఇలా అడిగి ఎవరైనా ఫోన్ చేస్తే తప్పకుండా సైబర్ నేరమని వెం టనే ఆ ఫోన్ కట్ చేసి వచ్చిన నెంబర్ ను బ్లాక్ చేయాలి. ఫైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. మీరు కానీ మీకు తెలిసిన వారు కానీ మీ బంధువులు కానీ ఎవరైనా సైబ ర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని వారు సూచించారు.

# కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలకు వెళ్లే ధైర్యం లేదు

## బీజేపీ నాయకులు సబిరెడ్డి వెంకటరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దిరాజు

**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 25:** వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలో రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా బిజెపి శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంలో భాగంగా గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానిక ఎన్నికలకు వెళ్లే దమ్ము ధైర్యం లేదన్నారు. అమలుకు సాధ్యం కానీ 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేస్తామని ఎన్ని కల్లో గెలిచారని గద్దెనెక్కాక అమలులో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందారని తీవ్రంగా విమర్శించారు.



ఉపాధ్యక్షులు రామన్నగారి వెంకటేశ్వర రెడ్డి మాట్లా డుతూ బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించి ఎన్నికలకు వెళ్లాల్సిందేనని కమిటీల పేరుతో కాలయాపన చేసి మోసం చేస్తే బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీని బొంద పెడుతుందని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ స్థానిక సంస్థలకు పాలక వర్గాలు లేకపోవడంతో రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వ నిధులు ఆగిపోయి గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై ప్రజల్లో వివరించాలని చెప్పారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఉపా ధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, మండల అధ్యక్షులు సంద వెంకటేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేమోని బాలరాజు, ప్రధాన కార్య దర్శి చిన్న నరసింహ, కార్యదర్శి సంపత్, గ్రామ నాయ కులు రాఘవేందర్, రాజశేఖర్, రామకృష్ణ, హరినాథ్ రెడ్డి, ఎల్ల స్వామి, బూత్ అధ్యక్షులు డాకేష్ ,సతీష్, నారా యణ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 25:** మాడుగుల పల్లి మండలంలోని పాములపాడు గ్రామంలో సోమవారం నూతన అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన అతి తక్కువ సమయంలోనే ప్రజలకు సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, మహి ళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇలా అనేక సంక్షేమాలు పేద ప్రజలకు అందించి ప్రజా ప్రభుత్వం గా ప్రజల మన్ననలు అందుకుం టుం దన్నారు. అలాగే మారుముల్లా గ్రామాలలో పేద పిల్లలకు పౌష్టిక ఆహారం అందించే లక్ష్యంగా నూతన అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పిల్లలకు మొదటి అక్షరాలు నేర్పించే పాఠశాలలు అంగన్వాడీ కేంద్రా లు కావున ప్రతీ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు




చేయాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. ఇందులో రాజీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, యువ నాయ కులు గడ్డం పురుషోత్తం రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సబ్బు హరికృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు మాంద్ర యాదగిరి యాదవ్, మాజీ ఎంపిటిసి లు యాత కళింగ రెడ్డి, గుండెపూరి లక్ష్మీ నర్సు, మామిడి సైదులు, తీగల సైదు లు, అంబేద్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఏండ్లుగా అభివృద్ధికి నోచుకోని కాలనీలు



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 25:** వనపర్తి పట్టణంలో వనపర్తి నియోజకవర్గ కంటెస్టెడ్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్ దృష్టికి 11 వ వార్డు కాలనీ సభ్యులు కొన్ని సమస్యలు తీసు కొచ్చారు. కాలనీ లో పర్యటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో గృహ నివాసం చేసుకొని 15 సంవ త్సరాలుగా జీవిస్తున్న ఇప్పటి వరకూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం లో అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సాగిస్తలేరని మా సమస్యను అధికారులు విన్నవించిన అభివృద్ధి లేని చోట ఇంటి గృహ నిర్మాణాలు ఎందుకు చేసుకున్నారని తిరిగి మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి చేస్తామన్న నాయకుల దగ్గ రకు వెళ్దామన్న కలిసే ప్రసక్తి లేదని తెలుపు తున్నారు. ఈ సమస్య లపై మున్సిపల్ అధికారి తో మాట్లాడిన దయానంద్ ముదిరాజ్. చుట్టూ ప్రవేట్ ప్లాట్లు ఉండటం వల్ల ప్లాట్ల యజమానులు అడ్డం పడుతున్నారు. కనుక సమస్య ను మెరుగు పరచడం విఫలం అవుతున్నామని అధికారులు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా దయా నంద్ ముదిరాజ్ మాట్లాడుతూ సగటు మనిషి జీవించడాని ఇల్లు, డ్రైనేజ్, కనీస రోడ్ల సదుపాయాలు, మంచినీరు అవసరం ఇవి ప్రజలకు కనీస అవసరాలు. ఇవి తెలుస్తే ప్రజలకు నాయకుల నుంచి అధికారుల నుంచి కోరుకునేది ఏమీ లేదు. నూతన సిసి రోడ్లు అమలు లో పలు కాలనీ లకు నోచుకోలేదని కొన్ని కాలనీ లలో వేసిన రోడ్ల పై రోడ్ల ను వేస్తున్నారనీ కనీస సదుపాయాలు లేని కాలనీల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు ఉన్నత అధికారులు స్పం దించి ప్రజల సమస్య ను తీర్చాలని కోరారు. కొంత మంది అధికారుల పనితీరు మాట దురుసు వల్ల ప్రజలతో తీవ్ర స్థాయిలో విమర్శలు ప్రభుత్వం ప్రజా ప్రతి నిధులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.

# మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 25:** వనపర్తి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కుందేళ్ల అర్జున్ యాదవ్ అధ్వర్యంలో వనపర్తి పట్టణం లోని రాజీవ్ చౌక్ లో బీపీ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కుందేళ్ల అర్జున్ యాదవ్ మాట్లా డుతూ బీసీ రిజర్వేషన్ల ప్రధాత, మండల్ నివేదిక రూపశిల్పి బీపీ మండల్ అని మండల్ సిఫార్సుల తోనే కేంద్ర ప్రభుత్వంలో విద్యా ఉద్యోగాలో 27% రిజర్వేషన్లు తాను కల్పించిందేనని గుర్తు చేశారు. మండల్ కమీషన్ 40 సిఫార్సులు చేస్తే అప్పటి కేంద్ర ప్రభుత్వం ఒక్క సిఫార్సే అమలు చేసిందని, మిగతా సిఫార్సులు అమ లు అయినప్పుడే దేశంలో బీసీలకు నిజమైన సామాజిక న్యాయం జరుగు తుందన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం మిగతా సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మూడు ప్రధాన పార్టీలు బీసీలను ఎన్నికల్లో పావులుగా వాడుకోని, మోసం చేస్తున్నాయని ఏ పార్టీ కి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని, కపట ప్రేమ చూపిస్తూ మొసలి కన్నీరు కారుస్తూన్నాయని ఫైర్ అయ్యారు. ఈ కార్యక్ర మంలో బీసీ కులాల ఐక్య వేదిక దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ గైనికాడి రాము లు యాదవ్, పసుల సత్య నారాయణ యాదవ్ సామాజిక ఉద్యమ కారులు, గంధం నాగరాజు బహుజన ఉద్యమకారులు, రామకృష్ణ, బీచుపల్లి, కురుమన్న, మండగిరి మహేష్ యాదవ్, జైపాల్, శ్రీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయం చేయండి

## - బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ, మహా ధర్నా




**జనం పవర్, పటాన్‌చెరు (జిన్నారం), ఆగస్టు 25:** జిన్నారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1, జంగంపేట్ 376 భూముల విషయంలో రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనం తరం ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని బిజెపి మండల అధ్య క్షులు కొత్త కాపు జగన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గత ప్రభుత్వ కాలంలో 180 ఎకరాల భూమి తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు రైతులకు ఎటువంటి పరి ష్కారం దొరకలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మాకు భూములు తిరిగి ఇస్తారా, లేదా 600 గజాల హెచ్ఎండీఏ లేఅవుట్ ఇచ్చి న్యాయం చేస్తారా? అని వారు ప్రశ్నించారు. నాలుగేళ్లు గడిచినా ఎలాంటి పరిణామం జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొని రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్ రావు, దేశ్ పాండే, ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్, వీరేష్, అశోక్, యాదయ్య, సీతరాజు, యాదగిరి, దుర్గేష్, మల్లేష్, ప్రవీణ్ తదితర నాయకులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలి

**సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి**

**లాభాల వాటా ఇవ్వాలి.. కార్పొరేట్ వైద్యం కల్పించాలి**

**సమస్యలపై సెప్టెంబర్ నెలలో రాష్ట్ర సదస్సు**

**ఐఎఫ్టియు నాయకులు రాసుద్దీన్, సంజీవ్**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25:** సింగరేణిలో సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచి ఇవ్వాలని లాభాల వాటలో 15 శాతం చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. రాసుద్దీన్, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్.సంజీవ్ డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఐఎఫ్టియు కార్యాలయంలో సోమవారం సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ సదస్సు కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీలో



సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సదుపాయాలపై చట్టబద్ధత హక్కులపై సెప్టెంబర్ 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ కార్మికులకు హెచ్‌పిసి వేతనాలు అమలు చేయాలని, 2024-25 సంవత్సరపు వార్షిక లాభాల్లో పదిహేను శాతం బోనస్ కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకై వచ్చే నెలలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కార్మిక వర్గాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ రాష్ట్ర సదస్సుకు ఐఎఫ్‌టియు జాతీయ నాయకులు అపర్ణ, బాలన్, టి.శ్రీనివాస్, సాదినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వారు తెలిపారు. ఈ సదస్సులో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మోతుక్కూరి మల్లికార్జునరావు, శరత్, అవినాష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అశోక్, నరేష్, సర్వీస్, రామన్న, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ బస్టాండ్‌లో వరద నీటి సమస్య

**సమస్యను పరిష్కరించాలని ప్రజావాణిలో లోగాని శ్రీనివాస్ వినతి పత్రం**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25:**
పాల్వంచ పట్టణంలోని బస్టాండ్‌లో చేరుతున్న వరదనీటి సమస్యను పరిష్కరించడంతోపాటుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించాలని ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు. పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ అభివృద్ధి జరుగుతున్న తరుణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న పాల్వంచ బస్టాండ్ పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. వరద నీటి సమస్యతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

వర్షం కురిస్తే చాలు వరద నీరంతా బస్టాండు ప్రాంగణంలో చేరుతుందని బస్టాండ్ నుంచి బయటకు వచ్చే దారి పూర్తిగా వరద నీటితో నిండి ప్రయాణికులకు పాదాచారులకు వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారిందన్నారు. ఈ సమస్య చాలా జటిలంగా ఉందని పేర్కొన్నారు. వర్షం వరద నీరు బయటకు పోకుండా బస్టాండ్ ప్రాంగణంలోనే నిలువ ఉండి వరద నీరు బయటకు పోయే మార్గం మూసివేయడం వల్ల ఇబ్బందికరంగా మారిందని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని లోగాని శ్రీనివాస్ అభ్యర్థించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**జనం పవర్, చెన్నూరు, ఆగస్టు 25:**
మంచిర్యాల జిల్లా చెన్నూరులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పడమటింటి కృష్ణమూర్తి ఫంక్షన్ హాల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూరు పట్టణ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పోలినేని దేవేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి శిబిరం ద్వారా నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం చాలా గొప్ప విషయం అని ఈ కార్యక్రమాలు బాధ్యతతో నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ జాడి తిరుపతి, బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కంటి శిబిరంలో 120 మంది పేర్లు నమోదు చేసుకొని, బిపి, షుగర్, కంటి పరీక్షల అనంతరం 48 మంది ఉచిత కంటి ఆపరేషన్ కోసం రేకుర్తి ఆసుపత్రికి పంపించినట్లు చెన్నూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ జాడి తిరుపతి తెలిపారు. పెషేంట్లకు, వారి వెంట వెళ్లే వారికి ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత భోజన వసతి ఉంటుందని తెలిపారు. రేపు కంటి ఆపరేషన్ తరువాత బుధవారం వారు చెన్నూరుకు తిరిగి వస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎస్ఐ సుబ్బారావ్, జోన్ ఛైర్పర్సన్ లయన్ మోదుంపురం వెంకటేశ్వర్, ఐ క్యాంపు డాక్టర్ జ్యోతి, డాక్టర్ కుదుషా, చెన్నూరు లయన్స్ క్లబ్ కోశాధికారి లయన్ నిమ్మల సాగర్, ఐ క్యాంపు చైర్మన్ లయన్ బెల్లంపల్లి నాగరాజ గౌడ్, కో చైర్మన్ లయన్ మాదాసు కిష్టయ్య, లయన్ సభ్యులు కప్ప ప్రతాప్ సింగ్, ప్రకాష్ బాబు, కట్ట సదానందం, జక్కుల సత్యనారాయణ, పున్నం చందు, మోర్ల మధుకర్, రాజబాబు, కొల్లూరి శంకర్, నాథంగారి సత్యనారాయణ, పడమటింటి శ్రీనివాస్, మంచాల రాజబాబు, రవీందర్ గౌడ్, ఆర్‌యంపి డాక్టర్ స్వామి, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

# కాసులకు కక్కుర్తి పడ్డాడు.. ఏసీబీకి చిక్కాడు

**లంచం తీసుకుంటూ పట్టుబడిన వ్యవసాయ శాఖ అధికారి**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25:**
భద్రాద్రి జిల్లా కేంద్రంలో కొంతమంది అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ దారుణంగా దోచుకుంటున్న పరిస్థితి నెలకొంది. కొందరు అవినీతిపరులు లంచం తీసుకుంటూ ఏసీబీ శాఖకు దొరికిన కూడా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి మాత్రం రాజ్యమేలుతుండడం కలవర పెడుతోంది.

చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల సహాయ వ్యవసాయ శాఖ సంచాలకుల కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహారావు సోమవారం ఒక వ్యక్తి నుండి రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. గతంలో ఒక ఫెర్టిలైజర్ షాప్ యజమాని యూరియా అమ్మకాలపై వ్యవసాయ శాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో ఆ షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవడానికి యజమాని నుండి అసిస్టెంట్ డైరెక్టర్ రూ.25 వేలు లంచం అడిగాడు. దీంతో బాధితుడు అధికారికి లంచం డబ్బులు ఇస్తుండగా ఏసీబీ డిఎస్‌పి వై.రమేష్ తన సిబ్బందితో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డిఎస్పి రమేష్ పేర్కొన్నారు.

## గణేష్ మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

**- గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్**




**జనం పవర్, రామగుండం, ఆగస్టు 25:** గణేష్ మండప నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ తెలిపారు. గోదావరిఖని పట్టణంలోని రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్ గోదావరిఖని-1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో గణేశ్ మండపాల నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండపం నిర్వాకులు పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేసి కేసుల్లో ఇరుక్కోవద్దని హెచ్చరించారు. గణపతి మండప నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించి, పోలీసులకు సహకరించా లని అన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఇన్స్పెక్టర్ ప్రసాదరావు రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ రామగుండం ఎస్ఐ సంధ్యారాణి వన్ టౌన్ ఎస్ఐలు రమేష్, భూమేష్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## కౌజు పిట్టల పెంపకం ద్వారా అదనపు ఆదాయం

**జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25:** కౌజు పిట్టల పెంపకం ద్వారా ఆదాయ మార్గాలను విస్తరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని శేషగిరినగర్ గ్రామ పంచాయతీలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన దుర్గాంబిక గ్రామ సంఘంలోని అరుణోదయ గ్రామ సమాఖ్యలోని ప్రణజ కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను సోమవారం కలెక్టర్ జితేష్ పాటిల్ సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను ప్రారంభించినందుకు మహిళా సంఘాలను అభినందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ప్రతి మండలంలోని మహిళా సంఘాల సభ్యులు కూడా కౌజు పిట్టలను పెంచుకోవాలని దాని ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రతి 40 రోజులకు ఒక్కసారి వీటిని అమ్ముకోవచ్చని మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉందని తెలిపారు. తదనంతరం చేపల పెంపక యూనిట్‌ను పరిశీలించి వారికి అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. సుజాతనగర్ మండలంలోని రవి హైబ్రిడ్ సీడ్స్ వారి క్షేత్రాన్ని సందర్శించి వారు పండిస్తున్న అన్ని రకాల కూరగాయల తోటలను పరిశీలించారు. జిల్లాలో కనీసం 10 గుంటల స్థలం కలిగిన ప్రతి మహిళా రైతు కూరగాయల సాగు ప్రారంభించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పైలట్ ప్రాజెక్ట్‌గా లక్ష్మీదేవిపల్లి మండలంలోని రైతు వేదికలో కూరగాయల సాగు మునగ సాగు కొర్రమీను చేపల పెంపకం కౌజు పిట్టల పెంపకాన్ని మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టి పర్యవేక్షించాలని సూచించారు.

సుజాతనగర్ మండలంలోని నాయకులగూడెం గ్రామంలో కొర్రమీను చేపల యూనిట్‌ను నిర్వహిస్తున్న మండే స్రవంతిని కలెక్టర్ అభినందించారు. అక్కడే కూరగాయలు కౌజు పిట్టల పెంపకం చేపడితే అదనపు ఆదాయం లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, సుజాతనగర్ యం.పి.డి.ఓ, యం.ఆర్.ఓ, లక్ష్మీదేవిపల్లి యం.పి.డి.ఓ, ఎపియం ఫాం, రెండు మండల ఎపియంలు, సిసిలు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు పెంచిన వేతనాలను చెల్లించాలి



**కలెక్టరేట్ ను ముట్టడించిన ఆశా కార్యకర్తలు**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25:**
ఆశా వర్కర్లకు పెంచిన వేతనాలను వెంటనే ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పెంచిన వేతనాలతో పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని ఏవోకి అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు)జిల్లా కోశాధికారి జి.పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. వీరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇస్తానని వాగ్దానం చేశారన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ప్రమాద బీమా 50 లక్షలు ఇస్తానన్న హామీ ఇంతవరకు అమలు చేయటం లేదన్నారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆశా వర్కర్లకు 62 ఏళ్ల వరకు పని భద్రత కల్పిస్తూ రిటైర్మెంట్ తర్వాత లక్షా యాభై వేల గ్రాట్యూటీ ఇస్తూ 180 రోజుల పాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తున్నారన్నారు. మరి మన రాష్ట్రంలో కూడా అదే పని చేస్తున్న ఆశా వర్కర్లకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఏఎన్సి, పిఎన్సీ టార్గెట్లను రద్దు చేయాలని సబ్ సెంటర్ పిహెచ్సి డ్యూటీలు చేయించరాదని అన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ప్రతి ఘటన తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆశా జిల్లా కార్యదర్శి దుబ్బ ధనలక్ష్మి, సిఐటి జిల్లా ఉపాధ్యక్షులు నబి, బాయ కార్యదర్శులు కే.సత్య, గద్దెల శ్రీనివాస్, ఆశా జిల్లా నాయకులు జయ, రుక్మిణి, మనీ లా, సుశీల, సుగుణ, హైమావతి, సుజాత, ఉష, భారతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రతాపరెడ్డి జీవిత చరిత్ర' పుస్తక ఆవిష్కరణ




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 25:** తెలంగాణ భాష సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలో దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతి సందర్భంగా 'ప్రతాపరెడ్డి జీవిత చరిత్ర' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని పాలమూరు ప్రముఖ వైద్యుడు, ప్రజా సేవకుడు డాక్టర్ జిల్లెల మాధవ రెడ్డికి అంకితం చేశారు. సురవరం ప్రతాపరెడ్డి, జిల్లెల మాధవరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుస్తక రచయిత ఆచార్య గంటా జలంధర్ రెడ్డిని చిన్నారెడ్డి శాలువా, షీల్డ్‌తో సన్మానించారు. జిల్లెల మాధవరెడ్డి కూతురు జిల్లెల శిల్పని శాలువా, షీల్డ్‌తో సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ పత్రిక సంపాదకునిగా, పరిశోధకుడుగా, పండితుడుగా, రచయితగా, క్రియాశీల ఉద్యమకారుడిగా, బహుభాష పండితునిగా సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ అనన్యమైనది అని అన్నారు. ఆంధ్ర కవి తెలంగాణ ప్రాంతంలో కవులు లేరని విమర్శిస్తే వారికి ధీటుగా సమాధానం ఇస్తూ 354 మంది కవులతో కూడిన గోల్కొండ కవుల సంచిక గ్రంథాన్ని రాసి ఆంధ్ర కవికి సమాధానం ఇచ్చిన గొప్ప కవి సురవరం ప్రతాపరెడ్డి అని కొనియాడారు. నిజాం రాజుకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలను చైతన్య పరుస్తూ అనేక రచనలు, పుస్తకాలు రచించారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, విద్యావంతులు, వివిధ మండలాలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు లేక రోధిస్తున్న పల్లె జనం

**ఓవైపు దారి సమస్య, మరోవైపు వాగు సమస్య**

**ఊరు దాటాలంటే గండమే అంటున్న గ్రామీణులు**

**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 25:** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని సండ్రోన్ పల్లి నుండి శంకరపల్లి వెళ్లే దారి గుంతలతో ఉండి ప్రయాణం చేయడానికి వీలుగా లేకుండా ప్రమాదంగా మారింది. ఆ గ్రామానికి మరోపక్క ఉన్న దారి, కనీసం కాలినడకన ప్రయాణం చేయడానికి మధ్యలో ఉన్న వాగుపై తాత్కాలికంగా నిర్మించిన వంతెన ఇటీవల వర్షాలకు పైపులు కొట్టుకుపోయాయి. గత ప్రభుత్వ హయాంలో.. ఈ వాగుపై వంతెన నిర్మాణానికి పనులు చేపట్టాలని ప్రణాళికలు వేశారు. గ్రామానికి చెందిన పిల్లలు మందమర్రి పట్టణంలోని పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. రాత్రిపూట గ్రామ ప్రజలకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆటో కూడా ప్రయాణించలేని పరిస్థితి ఉంది. వర్షాకాలం వచ్చిందంటే ఈ గ్రామం మొత్తం జల దిగ్బంధమే, ఏదైనా చిన్న ప్రమాదం సంభవిస్తే 108 వాహనం కూడా అందుబాటులోకి రాదు. దీనికి తోడు.. ఆ గ్రామం చుట్టూ.. పరి



సర ప్రాంతంలో గత కొంతకాలంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తూ.. అంతంత మాత్రంగా ఉన్న ఆ పల్లె దారిని ఇటుక బట్టీల ట్రాక్టర్లు పాడు చేస్తూ.. గుంతలమయంగా మారుస్తున్నాయి.

ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, అధి



కార పార్టీ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వివేక వెంకటస్వామి చొరవ చూపి, ఈ పల్లెకు రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# భయపెట్టేందుకు వస్తోన్న తమన్నా

'ఓదెల 2'తో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించింది కథానాయిక తమన్నా. ప్రస్తుతం వరుస సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్న ఆమె.. తన రాబోయే ప్రాజెక్టుతో ప్రేక్షకుల్ని భయపెట్టేందుకు సిద్ధమవుతోంది. కుర్రకారుని విశేషంగా అలరించిన చిత్రం 'రాగిణి ఎమ్ఎమ్ఎస్'. ఇప్పుడీ ఫ్రాంచైజీలో మూడో భాగం రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో కథానాయికగా తమన్నాను ఎంపిక చేసిందట చిత్రబృందం. ''మునుటి చిత్రాలకు పూర్తి భిన్నంగా 'రాగిణి ఎమ్ఎమ్ఎస్ 3' ప్రాజెక్టును తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తున్నారు నిర్మాత ఏక్తా కపూర్. ఈ ఫ్రాంచైజీని హారర్ కామెడీగా మార్చుతున్నారు. ఈ కొత్త శైలికి సరిగ్గా సరిపోయే స్క్రిప్ట్‌ను ఇప్పటికే పూర్తి చేసింది చిత్రబృందం. ప్రస్తుతం చర్చల దశల్లో ఉన్న ఈ ప్రాజెక్టులో నటించడానికి తమన్నా చాలా ఉత్సాహంగా ఉంద''ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

### వారసత్వంతోనో, పెళ్లితోనో కాదు..

# ఉపాసన 'స్పెషల్' పోస్టు

తాను ఎంచుకున్న రంగంలో ఎన్నో ఒత్తిళ్లు అధిగమించి ఓ స్థాయికి చేరుకోవడం వల్లే గుర్తింపు దక్కిందని, వారసత్వంతోనో, పెళ్లితోనో కాదని ప్రముఖ వ్యాపారవేత్త, నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన పేర్కొన్నారు. తన పనిపై తనకే కొన్నిసార్లు సందేహం కలిగేదని, అప్పుడప్పుడు నిరుత్సాహపడ్డానని, మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో మొదలుపెట్టే దానినని తెలిపారు. ఓ వ్యక్తిని ఏది ప్రత్యేకంగా నిలుపుతుందన్న అంశంపై సోషల్ మీడియాలో ఆమె ఓ పోస్టు పెట్టారు. 'ఖాస్ ఆద్మీ' పేరిట తన అభిప్రాయాలను పంచుకున్నారు. ''ఓ వ్యక్తిని సంపద, హోదా, విజయం లాంటివి గొప్పగా చూపిస్తాయా? స్పందించే గుణం, ఇతరులకు సాయం చేయడం లాంటివి గొప్పవారిని చేస్తాయా? అనే వాటికి ఎవరికి వారే సమాధానం వెతుక్కోవాలి. మనల్ని మనం ప్రేమించుకొని, మనకు మనం విలువ ఇచ్చుకున్న క్షణం మనల్ని ప్రత్యేకంగా నిలుపుతుందని భావిస్తున్నా. వృత్తిపరమైన విజయాలనే సమాజం గుర్తిస్తోంది. మహిళలు పెద్ద కలలు కనేందుకు వారికి ఇచ్చే ప్రోత్సాహం తక్కువ. నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే (2016) ప్రకారం.. 50 శాతం మంది భారతీయులు తాము అనుకున్న స్థాయికి వెళ్లలేకపోతున్నారు. ఈవిషయంలో దాదాపు 16 శాతం మహిళలు డిప్రెషన్‌కు గురవుతున్నారు. ముందు మిమ్మల్ని మీరు నమ్మండి. విజయం దానంతట అదే వస్తుంది''. ''మార్పునకు ఎంతో సమయం పట్టదు. ఒక్క సెకనులో వచ్చే మీ ఆలోచనతోనే మొదలవుతుంది. నేను మీతో నిజాయతీగా ఉండాలనుకున్నా. అందుకే ఈ పోస్టు పెట్టా. నా ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ అభిప్రాయాలు పంచుకున్నానే తప్ప ఓ నిపుణురాలిగా కాదు'' అని ఉపాసన పేర్కొన్నారు.



## స్పోర్ట్స్




# చరిత్ర సృష్టించిన చికిత

### యూత్ ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌గా తెలుగమ్మాయి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: తెలుగమ్మాయి తానిపర్తి చికిత (తెలంగాణ) చరిత్ర సృష్టించింది. ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఈ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. ఉత్కంఠభరితంగా సాగిన అండర్-21 మహిళల కాంపౌండ్ ఫైనల్లో చికిత 142-136తో యెరిన్ పార్క్ (కొరియా) పై విజయం సాధించింది. అంతకుముందు సెమీస్‌లో చికిత 142-133తో పౌలా డయాజ్ (స్పెయిన్)పై చికిత నెగ్గింది. క్వార్టర్స్‌లో టాప్ సీడ్ పర్ణీత్ కౌర్‌ను చికిత చిత్తు చేసింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన 20 ఏళ్ల చికిత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తోంది. సాయ్ కోచ్ క్రాంతిరెడ్డి దగ్గర సోనీపత్‌లోని జాతీయ శిక్షణ శిబిరంలో తర్ఫీదు పొందుతోంది.

# పిచ్‌పై గోడ కట్టిన వేళ.. బౌలర్లకు అగ్నిపరీక్షే..!

టెస్ట్ క్రికెట్‌లో బ్యాటింగ్ ఓ ప్రత్యేకమైన కళ. 20 వికెట్లు పడగొడితేనే విజయం. బ్యాటర్లు నిగ్రహంగా క్రీజులో నిలదొక్కుకొని.. బౌలర్ల తప్పులను పసిగట్టి స్కోర్‌బోర్డును మెల్లగా ముందుకు తీసుకెళ్లాలి. దీనికి భిన్నంగా దూకుడుగా ఆడి వికెట్లు సమర్పించుకొంటే.. ప్రత్యర్థి బ్యాటర్లు క్రీజులో అధిక సమయం పాతుకుపోయి భారీ లక్ష్యాలను ముందుంచే ప్రమాదం ఉంది. పరుగులు ఎంత ముఖ్యమో.. క్రీజులో ఎక్కువసేపు నిలబడటం అంతే కీలకం. ఈ కళలో ఆరితేరిన అరుదైన బ్యాటర్లలో చెతేశ్వర్ పుజారా ఒకడు. భారత్ తరఫున ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక బంతులు ఎదుర్కొన్న రికార్డు అతడి సొంతం..! పిచ్‌పై గోడ కట్టారా అన్నట్లు ఆడిన భారత ఆటగాళ్ల ఇన్నింగ్సులు ఇవి. వారెవరో చదివేయండి.

**పోరాడి డ్రా చేసిన గావస్కర్..**

దిగ్గజ ఓపెనర్ సునీల్ గావస్కర్ కెరీర్‌లో మర్చిపోలేని మ్యాచ్ 1981లో బెంగళూరులో ఇంగ్లాండ్‌తో జరిగింది. ఈ మ్యాచ్‌లో లిటిల్ మాస్టర్ 172 పరుగులు చేశారు. ఇందుకోసం ఏకంగా 472 బంతులను ఎదుర్కొన్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో 19 ఫోర్లు కొట్టారు. దీంతో భారత్ స్కోర్ 428కి చేరి, 28 పరుగుల ఆధిక్యం లభించింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గావస్కర్‌ను వరించింది.

**ఆసీస్ పిచ్‌లపై బౌలర్లకు అగ్నిపరీక్ష**

స్వదేశంలో ఆస్ట్రేలియా బౌలర్లను ఆడటం అంత ఈజీ కాదు. అలాంటిది 1992లో సిడ్నీ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రవిశాస్త్రి ఏకంగా 477 బంతులను ఎదుర్కొని డబుల్ సెంచరీ (206) చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 313 స్కోర్ సాధిస్తే.. శాస్త్రి ఇన్నింగ్స్ సాయంతో భారత్ 483 చేసింది. బౌలింగ్‌లో అతడు నాలుగు వికెట్లు తీసుకొని రాణించాడు. డ్రా అయిన ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**విండీస్ బౌలర్లు రెక్కలు ముక్కలు చేసుకొన్నా..**

90ల్లో విండీస్ బౌలింగ్ క్రికెట్ ప్రపంచాన్ని గడగడలాడించింది. ఆంబ్రోస్, వాల్ష్, బిషప్, రోజ్ వంటి భీకరమైన సీమ్ దళం ఉంది. 1997 పోర్ట్ ఆఫ్ స్పెయిన్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో భారత బ్యాటర్ నవ్‌జోత్ సింగ్ సిద్ధూ విండీస్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. 491 బంతులను ఎదుర్కొని 201 పరుగులు సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి జట్టు 296 స్కోర్ సాధించగా.. భారత్ 436 చేసింది. ఈ ఇన్నింగ్స్ కరేబియన్ బౌలర్లకు చాలాకాలం గుర్తుండిపోయింది.



**దాయాదికి వారి సొంతగడ్డ పైనే దడ పుట్టించిన 'ది వాల్'**

2004లో రావల్పిండి వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రాహుల్ ద్రవిడ్ చుక్కలు చూపించాడు. 495 బంతులను ఎదుర్కొని 270 పరుగులు చేశాడు. 54.54 సగటు సాధించిన అతడు ఆ ఇన్నింగ్స్‌లో ఏకంగా 34 బౌండరీలు బాదాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 600 పరుగులు చేయగా.. పాక్ 224 చేసింది. మొత్తం మీద భారత్‌కు 131 పరుగుల భారీ విజయాన్ని ద్రవిడ్ అందించాడు. సౌమ్యంగా కనిపించే రాహుల్ ద్రవిడ్ పాక్ బౌలర్లకు పీడకలగా మారాడు.

**భారత్ క్రికెట్ చరిత్రలో ఇదో మారథాన్ ఇన్నింగ్స్**

ఈ జాబితాలో చెతేశ్వర్ పుజారా మారథాన్ ఇన్నింగ్స్ అగ్రస్థానంలో ఉంటుంది. 2017లో రాంఛీ వేదికగా ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లో విశ్వరూపం చూపించాడు. 672 నిమిషాలు క్రీజులో పాతుకుపోయి 525 బంతులను ఎదుర్కొని 202 పరుగులు సాధించాడు. భారత్ 603 పరుగులకు డిక్లేర్ చేసింది.

**చెక్కుచెదరని ప్రపంచ రికార్డు**

ఈ జాబితాలో ప్రపంచ రికార్డు మాత్రం భారత్ పేరిట లేదు. 1938 ఆగస్టు 20నే దీనిని సృష్టించారు. ఇప్పటికీ దానిని టచ్ చేసిన వాళ్లు లేరు. ఇంగ్లాండ్ బ్యాటర్ నియోనార్డ్ హట్టొన్ ఓవల్ మైదానం వేదికగా ఆసీస్‌పై దీనిని నెలకొల్పాడు. నాడు 847 బంతులను ఎదుర్కొని.. 364 పరుగులు చేశాడు. ఇందుకోసం 797 నిమిషాలు మైదానంలో ఉన్నాడు.

PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA,
PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL **TEL/2016/69862**, EDITOR:BANDARI MARUTHI.